Licensed to post without Prepayment No. J/Nellore/003/2018-20 R.N.I.No.25359/74 - PLG/NL/9-10/03
నెల్లూరు, 01.03.2019, శుక్రవారం సంపుటి : 38 సంచిక : 39 పేజీలు : 16, వెల : ₹ 5




# లాయర్

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి
www.lawyerteluguweekly.com



# జయహో భారత్

15లో

- ఉగ్రశిబిరాలను తుదముట్టించిన వాయుసేన
- పుల్వామా దాడికి ప్రతీకారం
- 350మందికి పైగా ఉగ్రవాదులు హతం
- పాకిస్థాన్‌కు అదురుదెబ్బ
- దేశ వ్యాప్తంగా పెరిగిన మోడీ ఇమేజ్
- కయ్యానికి కాలు దువ్వుతున్న పాకిస్థాన్ ఆర్మీ
- పాక్ అదుపులో భారత్ పైలట్ అభినందన్
- భారత్‌కు మద్దతుగా నిలిచిన ప్రపంచ దేశాలు
- రణమా... శరణమా... నిర్ణయం పాక్‌దే
- చర్చలకి ఛాన్స్ ఇవ్వాలంటున్న ఇమ్రాన్



# వేడెక్కిన ఏపి... నేతల్లో బీపి

- అభ్యర్థుల ఎంపికపై దృష్టి పెట్టిన ఇరు పార్టీలు
- ఆశావహుల్లో రేకెత్తిన గుబులు

దేశ సరిహద్దుల్లో యుద్ధ వాతావరణం టెన్షన్ వుంటే ఏపిలో మాత్రం ఎన్నికల యుద్ధ టెన్షన్ నెలకొంది. రాష్ట్రంలోని 25లోక్‌సభ స్థానాలకు, 175 అసెంబ్లీలకు ఒకే విడతలో ఎన్నికలు జరుగనున్నాయి. రాష్ట్రంలో ఎండలతో పాటు ఎన్నికల వాతావరణం కూడా మండిపోతోంది. రెండు ప్రాంతీయ పార్టీల మధ్య సంకుల సమరానికి రాష్ట్రం వేదిక కాబోతోంది. అధికారాన్ని నిలుపుకోవడానికి తెలుగుదేశం, 2014 ఎన్నికల్లో తృటిలో కోల్పోయిన అధికారాన్ని ఈసారి చేజిక్కించుకోవడానికి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలు కథనోత్సాహంతో వున్నాయి. ఇరుపార్టీలు కూడా ఎన్నికల యుద్ధ సన్నాహాలలో తలమునకలై వున్నాయి.

(మిగతా 15వ పేజీలో)









# మాగుంట... ఏ ఇంట?

ఒంగోలైతే వైసిపి
నెల్లూరైతే టిడిపి

బాలిప్పుడు శీనయ్య కోర్టులో 16లో



# పార్టీయే పరమావధి...
# పోరాటమే ఆయన విధి

## 35 సంవత్సరాలుగా అలుపెరుగని పోరాటం చేస్తూ తెలుగుదేశం పార్టీ విధేయుడిగా పోరాటయోధుడిగా మిగిలిపోయిన నూనె మల్లిఖార్జునయాదవ్



నెల్లూరుజిల్లా రాజకీయాలలో ఎప్పుడు ఏ నాయకుడు ఫామ్‌లో వుంటాడో, ఏ పదవి ఎప్పుడు ఎవరిని వరిస్తుందో ఊహించడం అసాధ్యం. అటు కాంగ్రెస్‌పార్టీ లోనూ ఇటు తెలుగుదేశం పార్టీలోనూ దశాబ్దాలుగా ఇదే పరిస్థితి. పార్టీ జెండాలు మోసి పార్టీ అజెండాలను ప్రజల ముంగిళ్ళలోకి తీసుకువెళ్ళి అవసరమైనప్పుడు పార్టీ కోసం పోరాడే ద్వితీయశ్రేణి వ్యక్తులు ఒక్కోసారి గుర్తింపుకు నోచుకోరు.

తెల్లవారింది మొదలు రాత్రి వరకు జిల్లాకు చెందిన ఒకే అగ్రనాయకుడిని నమ్ముకుని ఆ నాయకుడి అడుగులకు మడుగులు వత్తుతూ, ఆయన వెంట నీడలా తిరుగుతూ ఆయన సేవలో తరిస్తూ వుంటే అలాంటి వ్యక్తులకు వారు పార్టీలో జూనియర్లైనా రాష్ట్ర స్థాయి పదవి అనూహ్యంగా వరిస్తుంది. ఇలా రెండు కోవలకు చెందిన ద్వితీయశ్రేణి నాయకులు జిల్లాలో అన్ని పార్టీల్లోనూ ఉన్నారు.

తెలుగుదేశం పార్టీలో మొదటి కోవకు చెందిన నాయకుడే నెల్లూరు 21వ డివిజన్ కార్పొరేటర్ నూనె మల్లిఖార్జున యాదవ్. గత 35సంవత్సరాలుగా రాజకీయాలలో వుంటూ ఒకే పార్టీ సిద్ధాంతంతో తెలుగుదేశం జెండాని మోస్తూ బిసి నాయకుడిగా మంచి గుర్తింపును సాధించినా, ఆ గుర్తింపును జిల్లా స్థాయికే పరిమితం చేసుకున్న వ్యక్తి నూనె మల్లి.

1995లో తనకు సంబంధంలేని వార్డులో పార్టీ టిక్కెట్టిచ్చినా పోటీ చేసి ఓటమిపాలై, పట్టువదలని విక్రమార్కుడిలా 2000 సంవత్సరంలో చాట్ల నరసింహారావుపై 27వ వార్డులో అనూహ్య విజయాన్ని సాధించి అప్పట్లో పెద్ద సంచలనాన్ని సృష్టించాడు. ఆ తరువాత కాలంలో తెలుగుదేశం పార్టీ బిసి విభాగం నగర అధ్యక్షుడిగా రెండు పర్యాయాలు విధులు నిర్వహించాడు. తెలుగు యువత నగర అధ్యక్షుడి పదవితో పాటు రాష్ట్ర బి.సి విభాగం ప్రధాన కార్యదర్శి హోదా కూడా మల్లిని వరించింది.

రూరల్ నియోజకవర్గం కోసం ఏర్పాటు చేసిన త్రిసభ్య కమిటీలోనూ, 7మెన్ కమిటీలోనూ మల్లికి చోటు లభించింది. అదేవిధంగా వెంకటగిరి నియోజకవర్గ ఇన్‌ఛార్జ్‌గా కూడా ఆయన పని చేశాడు. జిల్లా పార్టీ అధికార ప్రతినిధిగానూ ఇంకా జిల్లాలో పార్టీకి సంబంధించిన అనేక విభాగాల్లోనూ మల్లి తన సేవలందించాడు. ఇప్పటికీ అందిస్తూనే వున్నాడు.

గతంలో తాళ్ళపాక అనూరాధ ఛైర్‌పర్సన్‌గా వున్న తరుణంలోను మున్సిపల్ బై ఎలక్షన్ తరుణంలోనూ ప్రత్యర్థులను ధీటుగా ఎదుర్కొని పార్టీ కోసం పోరాడిన వ్యక్తిగా మల్లికి గుర్తింపు వుంది. అనిల్ కుమార్‌యాదవ్ ఓ వైపు, బుర్రా వెంకటేశ్వర్లుగౌడ్ మరోవైపు పోరాడుతుంటే ఆ సమయంలో తన కులాభిమానాన్ని కూడా పక్కనపెట్టి పార్టీ కోసం పనిచేశాడు మల్లి యాదవ్. ప్రస్తుతం 21వ డివిజన్ కార్పొరేటర్‌గా గెలిచి నిత్యం ప్రజలకు అందుబాటులో వుంటూ ప్రజల అవసరాలను గుర్తించి పనిచేస్తూ... మరోవైపు పార్టీ వ్యవహారాలలో కూడా ఎక్కడ తన అవసరమొచ్చినా నేనున్నానంటూ ముందుండి పని చేస్తున్నాడు. కౌన్సిల్ కీలక సమావేశాల్లో ఆనం రంగమయూర్‌తో పలు దఫాలు వాగ్వివాదానికి దిగి 'ఆనం' వర్గాన్ని ఎదిరించిన ధీరుడిగా కూడా పేరుపొందాడు.

మూడున్నర దశాబ్దాల పాటు బిసి నాయకుడిగా కష్టించి పని చేస్తున్న తమ నాయకుడికి ఇప్పటివరకు ఒక్కసారి కూడా ప్రభుత్వ పరమైన పదవి ఏదీ రాలేదని, నిన్న మొన్న పార్టీలోకి వచ్చి అగ్రనాయకుల భజన చేసేవారికి గుర్తింపునిస్తోందని మల్లిఖార్జునయాదవ్ అభిమానులు వాపోతున్నారు.

నిద్రలేచిన దగ్గర నుండి ప్రజల కోసం, పార్టీ కోసం తమ నాయకుడు పని చేస్తాడని, ఎప్పుడూ అందరికీ అందుబాటులో వుంటాడని, అలాంటి వాడిని ఇటు జిల్లా పార్టీ నాయకత్వం అటు పార్టీ అధిష్టానం గుర్తించకపోవడం బాధాకరమని వారు వాపోతున్నారు. ఇప్పటికైనా జిల్లా నేతలు మేల్కొని తమ నాయకుడి కష్టాన్ని గుర్తించి తగిన స్థానం కల్పించాలని వారు డిమాండ్ చేస్తున్నారు.



బుధవారం నెల్లూరు ఎంపిడివో కార్యాలయంలో 50ఏళ్ళు పూర్తైన ఎస్టీలకు పింఛన్ పథకాలను అందజేస్తున్న మాజీమంత్రి, నెల్లూరురూరల్ టిడిపి అభ్యర్థి ఆదాల ప్రభాకర్‌రెడ్డి.

# తెలుగుభాష పరిరక్షణ మనందరి కర్తవ్యం

## - ప్రముఖ సారస్వతవేత్త మోపూరు వేణుగోపాలయ్య

మన తెలుగుభాష సుసంపన్నమైనదని, ఆ భాషను వేరెవరూ మరుగుపరచలేరని, అయితే మనకు మనమే మన భాషను విస్మరిస్తున్నామని..ఇలాంటి దుస్థితి మరెక్కడా కనిపించదని ప్రముఖ సారస్వతవేత్త మోపూరు వేణుగోపాలయ్య అన్నారు. గత నెల21 నెల్లూరులోని అన్నదేవుల గోవింద రెడ్డి సరస్వతీ సమాజంలో 37 సంస్థల సహకారంతో మాతృభాషోత్సవ కార్యక్రమం జరిగింది. సరస్వతీ సమాజం కార్యదర్శి టి.రమణయ్య సభను స్వాగతించారు. సభకు అధ్యక్షత వహించిన మోపూరు వేణుగోపాలయ్య మాట్లాడుతూ మాతృ భాషను విస్మరిస్తే మరికొంత కాలానికి తెలుగుభాష కేవలం మాట్లాడుకునే భాషగానే మిగిలిపోయే ప్రమాదంలో పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. తెలుగుభాష పరిరక్షణ మనందరి కర్తవ్యమని, ప్రజలు-ప్రభుత్వం కలసికట్టుగా కృషిచేసి తెలుగుభాషకు మరింత వెలుగులు తేవాలని కోరారు. ఈ సభలో ప్రముఖ వైద్యుడు డా.శ్రీనివాసతేజ మాట్లాడుతూ మాతృభాష నేర్చుకుంటేనే ఏ విషయమైన త్వరగా, స్పష్టంగా అర్ధమవుతుందన్నారు. అయితే ఇప్పుడు పుట్టిన బిడ్డకు కూడా ఇంగ్లీషు మాటలు నేర్పుతున్నారని, తల్లిదండ్రులు తమ పిల్లలకు మాతృభాష అయిన తెలుగును చక్కగా నేర్పాలన్నారు. తెలుగుభాషోద్యమ సమితి అధ్యక్షులు చెలంచర్ల భాస్కరరెడ్డి మాట్లాడుతూ అందరం కలిసి మన మాతృ భాషను పరిరక్షించుకోవాలన్నారు. తెలుగు భాష పరిరక్షణకు తెలుగుభాషోద్యమ సమితి చేస్తున్న కృషిని ఆయన వివరించారు. ఈ సందర్భంగా జానపద కళావేదిక తదితర సంస్థల వారు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి.




సభలో మాట్లాడుతున్న మోపూరు వేణుగోపాలయ్య


## FORM IV
(See Rule 8)

Statement about Ownership and other Particulars about News Paper, **Lawyer (Weekly)**

1. Place of Publication : Plot No.1&2, MainRoad, Maganta Layout, Nellore - 524 003.
2. Periodicity of its Publication : Weekly
3. Printer's Name : Thunga Siva Prabhath Reddy
   Nationality : Indian
   Address : Plot No.1&2, MainRoad, Magunta Layout, Nellore - 524 003.
4. Publisher's Name : Thunga Siva Prabhath Reddy
   Nationality : Indian
   Address : Plot No.1&2, MainRoad, Magunta Layout, Nellore - 524 003.
5. Editor's Name : Thunga Siva Prabhath Reddy
   Nationality : Indian
   Address : Plot No.1&2, MainRoad, Magunta Layout, Nellore - 524 003.
6. Name and Address of individuals who own the News Paper and Partners or share holders holding more than one percent of the total Capital : Thunga Siva Prabhath Reddy
   Nationality : Indian
   Address : Plot No.1&2, MainRoad, Magunta Layout, Nellore - 524 003.

I, Thunga Siva Prabhath Reddy hereby declare that the particulars given above are true to the best of my Knowledge and belief.

(Sd)

01.03.2019 SIVA PRABHATH REDDY.T


## శ్రీకాళహస్తిలో అంగరంగవైభవంగా..
# మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు
## - 4న మహాశివరాత్రి, 5న రథోత్సవం.. 6న కల్యాణోత్సవం

దక్షిణకాశిగా ప్రసిద్ధిగాంచిన శ్రీ కాళహస్తీశ్వరాలయంలో గతనెల 27 నుంచి మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. 27న భక్తకన్నప్ప ధ్వజారోహణం, 28న శ్రీ స్వామివారి ధ్వజారోహణం (దేవరాత్రి) కన్నులపండువగా జరిగాయి. మార్చి 1వ తేది రెండవ తిరునాళ్ళ (భూతరాత్రి), 2న రావణాసుర-మయూరవాహన సేవ (గాంధర్వరాత్రి), 3న నాల్గవ తిరునాళ్ళ (నాగరాత్రి), 4న మహాశివరాత్రి మరెంతో వైభవోపేతంగా నిర్వహించనున్నారు. అదేవిధంగా 5వ తేది ఉదయం రథోత్సవం, రాత్రికి తెప్పోత్సవం (బ్రహ్మరాత్రి), 6న కల్యాణోత్సవం (స్కంధరాత్రి), 7న సభాపతి కల్యాణం, 8న కైలాసగిరి ప్రదక్షిణం, 9న తీర్థవారి (ధ్వజావరోహణం) జరుగుతాయి. అనంతరం 10న స్వామివార్లకు పల్లకిసేవ, 11న ఏకాంత సేవ జరుగుతాయని ఆలయ కార్యనిర్వహణాధికారి శ్రీరామ రామస్వామి తెలియజేశారు. ఈ బ్రహ్మోత్సవాలకు భక్తులు పెద్ద



సంఖ్యలో తరలివస్తారు కనుక, ఎలాంటి ఇబ్బందులు లేకుండా భారీ ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ముఖ్యంగా పొరుగు రాష్ట్రాల నుంచి వచ్చే భక్తులు స్వామివారిని దర్శించుకునేందుకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. జిల్లా కలెక్టర్ ప్రద్యుమ్న, దేవాదాయ ధర్మాదాయశాఖ కమిషనర్‌ల సూచనల మేరకు బ్రహ్మోత్సవాలకు పటిష్టమైన ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.



# LIVING LEGEND@90

We Wish Long Healthy Life to
A Living Legend
Guding Star to Our Family
and Highly Philanthropic
Ajaatha Sathruvu

## Dr. CHILLAKURU RADHAKRISHNA REDDY

(DR C R REDDY MS) ON HIS

**90th BIRTHDAY**

1st MARCH 2019

SISTER - SMT. C.ANASUYAMMA, MANUBOLU
BROTHER - DR. C.MOHANREDDY, CHENNAI
BROTHER - PROF. C.M.K.REDDY - SMT. NIRMALA, CHENNAI
NEPHEW - DR. C.M.KISHORE - SMT. LEELADEVI, CHENNAI
NIECE - SMT. K.HARITHA - DR. RAMANAND REDDY, KAKINADA
JAIESH & ASHMITHA KEERTHANA & TANAV

## 'ప్రభా'తం

ఒక చెంప కొడితే రెండో చెంప చూపించిన పూజ్య బాపూజీ సిద్ధాంతాన్ని ఏడు దశాబ్దాలుగా ఆచరిస్తున్నాం. చైనా వాడు యుద్ధానికొచ్చాడు... ఒక చెంప కొట్టాడు... రెండో చెంప చూపించారు. మానస సరోవర్‌ను స్వాధీనం చేసుకున్నారు. పాకిస్థాన్ వాడొచ్చాడు... ఒక చెంప మీద కొట్టాడు... రెండో చెంప చూపించాం. పాక్ ఆక్రమిత కాశ్మీర్‌ను ఆక్రమించేశాడు. రెండు దేశాలతో జరిగిన రెండు యుద్ధాలలో గెలుపు మనదే, నష్టమూ మనదే! అత్యంత విలువైన భూభాగాలను కోల్పోయాం. ఇదంతా కూడా ఒక చెంపన కొడితే రెండో చెంప చూపించమన్న సూత్రానికి అనుభవించిన ఫలితం.

భారత్ ఇంకా అదే సిద్ధాంతాన్ని అనుసరిస్తుందనే భ్రమలో పాకిస్థాన్, దాని ప్రేరేపిత ఉగ్రవాద సంస్థలున్నట్లున్నాయి. ఆ భ్రమలోనే ఉగ్రదాడులకు పాల్పడుతున్నాయి. కాని, ఇప్పుడుండేది పాకిస్థాన్‌లోని ముస్లింలను, భారత్‌లోని ముస్లింలను ఒకే కోణంలో చూసే కాంగ్రెస్ ప్రభుత్వం కాదు, భారతదేశంలో వున్న ముస్లింలను భారతీయులుగానే, ఈ దేశాన్ని ప్రేమించే వారిగానే చూసే నరేంద్ర మోడీ ప్రభుత్వం. ఓట్ల బ్యాంకు రాజకీయాలకు భయపడని ప్రభుత్వం. అందుకే ఒక చెంప మీద కొట్టిన పాకిస్థాన్‌ను రెండు చెంపలు వాయించింది. భారత్‌తో పెట్టుకుంటే ఏం జరుగుతుందో గతంలో సర్జికల్ స్ట్రైక్ ద్వారా చూపించింది. తాజాగా ఉగ్రశిబిరాలపై వైమానిక మెరుపు దాడులతో పాకిస్థాన్‌కు దిమ్మతిరిగే సమాధానమిచ్చింది.

భారత్ ప్రతీకారానికి పాల్పడితే పర్యవసానం ఎలా వుంటుందో ఫిబ్రవరి 26వ తేదీ తెల్లారుజామున 3.45 నుండి 4.07 గంటల మధ్యలో జరిగిన భారత వైమానిక దాడులను చూస్తే పాకిస్థాన్‌కు అర్ధమై వుంటుంది. భారత జాతి యావత్తు రెండు వారాలుగా పగతో రగిలిపోతోంది. ప్రతి భారతీయుడి రక్తం మరిగిపోతూ వుంటుంది. ఫిబ్రవరి 14వ తేదీన జమ్ము కాశ్మీర్ రాష్ట్రంలోని పుల్వామా హైవేపై జరిగిన ఉగ్రదాడిలో వాహనాలలో సరిహద్దుకు వెళుతున్న 44మంది సిఆర్‌పిఎఫ్ జవానులు వీరమరణం పొందారు. జైషే మహ్మద్ ఉగ్రవాది అదిల్‌అహ్మద్ చేసిన ఆత్మాహుతి దాడితో ప్రపంచమే ఉలిక్కిపడింది. ఉగ్రదాడుల వేటలో నిరంతరం శ్రమపడుతున్న కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వానికి ఈ దాడి పెద్ద సవాల్‌గా మారింది. గతంలో యూరి, పఠాన్‌కోట్ దాడులకు సర్జికల్ స్ట్రైక్‌తో ప్రతీకారం తీర్చుకున్న భారత ప్రభుత్వం ఈసారి పాకిస్థాన్‌ను అన్ని విధాలా కట్టడి చేసే పనికి శ్రీకారం చుట్టింది. పాకిస్థాన్ ఆర్థిక మూలాలను దెబ్బతీసే పని మొదలుపెట్టింది. పాక్‌కు భారత్ నుండి కూరగాయల ఎగుమతిని నిలిపి వేయడమే కాక, ఆ దేశం నుండి వచ్చే సరుకు రవాణాపై 200శాతం సుంకాలు పెంచింది. నెహ్రూ నిర్వాకం మూలంగా 70ఏళ్ళ నుండి పాకిస్థాన్ అనుభవిస్తూ వచ్చిన సింధు నదీ జలాలకు అడ్డుకట్ట వేయాలని నిర్ణయం తీసుకుంది. ఈ పరిణామాలతోనే పాక్‌ను అష్ట దిగ్బంధనం చేసినట్లయ్యింది. ఇక పాక్ ఉగ్రదాడికి వ్యతిరేకంగా ఐక్యరాజ్య సమితిలో చేసిన తీర్మానానికి అన్ని దేశాలే కాదు, పాక్ మిత్రదేశమైన చైనా కూడా మద్దతు పలకడంతో ఆ దేశం నోట్లో పచ్చి వెలక్కాయ పడినట్లయ్యింది.

పుల్వామా దాడి విషయంలో నరేంద్ర మోడీ పాక్‌పై దౌత్యయుద్ధం చేస్తున్నాడని అందరూ భావిస్తున్న తరుణంలో భారత యుద్ధ విమానాలు ఒక్కసారిగా గర్జించాయి. ఫిబ్రవరి 26వ తేదీ తెల్లారుజామున 3.45గంటల ప్రాంతంలో 12 మిరాజ్ యుద్ధ విమానాలతో పాక్ ఆక్రమిత కాశ్మీర్‌లోని జైషే మహ్మద్ ఉగ్రశిబిరాలపై విరుచుకుపడ్డారు. వెయ్యి కిలోల బాంబులు వదిలారు. దాదాపు 350మంది ఉగ్రవాదులను హతమార్చారు. పాకిస్థాన్ ఊహలకు అందని దాడి ఇది! పాకిస్థాన్ రాడార్లకు కూడా అందకుండా మిరాజ్‌లు తమ పని పూర్తి చేసుకు వచ్చాయి. ఈ మెరుపు దాడి తర్వాతే ప్రధాని నరేంద్ర మోడీ ముఖంలో నవ్వు వచ్చింది. రెండు వారాల పాటు దిగాలుగావున్న త్రివర్ణ పతాకం రెపరెపలాడింది. భారతీయులు తిరిగి సగర్వంగా తలెత్తారు.

భారత్ దాడితో పాకిస్థాన్ అతలాకుతలమవుతోంది. పాక్ ప్రధాని ఇమ్రాన్‌ఖాన్‌కు చెప్పుకోలేని ఇబ్బందులు ఎదురవుతున్నాయి. పార్లమెంటులో ఆయనకు నిరసనల సెగ తగిలింది. ఉగ్రదాడి తర్వాత శాంతికి ఓ అవకాశం ఇవ్వండంటూ వేడుకున్న ఆయన భారత దాడిపై ఐక్యరాజ్యసమితిని ఆశ్రయించాడు. పాక్ ఆర్మీ చేతిలో ఇమ్రాన్ కీలుబొమ్మ. పాక్ ఆర్మీ ఇంతవరకు ఉగ్రవాదులను ముందుకు తోసి భారత్‌లో రక్తపాతం సృష్టిస్తోంది. ఇప్పుడు భారత వాయుసేనే పాక్ ఆక్రమిత కాశ్మీర్‌లోకే వెళ్లి ఉగ్ర శిబిరాలను ధ్వంసం చేసింది. పాక్ నుండి ఇక ముందు ఎటువంటి సవాళ్ళు ఎదురైనా భారత త్రివిధ దళాలు సన్నద్ధంగా వున్నాయి. పాక్ ఉగ్రశిబిరాలపై భారత దాడిని ఏ దేశం వ్యతిరేకించలేదు. ఏ దేశమూ ఖండించలేదు. దీంతో పాకిస్థాన్ తీవ్ర నైరాశ్యంలో చిక్కుకుపోయింది.

గత కొన్ని దశాబ్దాలుగా భారత్‌లో పాక్ ప్రేరేపిత ఉగ్రవాదులు ఎన్నో విధ్వంసాలు సృష్టించారు. కొన్ని లక్షల మంది సైనికులు, పౌరులు ఈ దాడుల్లో ప్రాణాలు కోల్పోయారు. ఎన్ని దాడులు జరిగినా శాంతి, సహనం అనే మంత్రాలను మన పాలకులు వల్లిస్తూ వచ్చారు. ఇప్పుడు ఆ రోజులు పోయాయి. ఆ నాయకులు పోయారు. కన్నుకు కన్ను... పన్నుకు పన్ను, ఒక తలకు పది తలలు... ఇదే నరేంద్ర మోడీ లెక్క! ఇది పక్కా!

### సరిహద్దుల్లో యుద్ధమేఘాలు



**పుల్వామా దాడి విషయంలో నరేంద్ర మోడీ పాక్‌పై దౌత్యయుద్ధం చేస్తున్నాడని అందరూ భావిస్తున్న తరుణంలో భారత యుద్ధ విమానాలు ఒక్కసారిగా గర్జించాయి. ఫిబ్రవరి 26వ తేదీ తెల్లారుజామున 3.45గంటల ప్రాంతంలో 12 మిరాజ్ యుద్ధ విమానాలతో పాక్ ఆక్రమిత కాశ్మీర్‌లోని జైషే అహ్మద్ ఉగ్రశిబిరాలపై విరుచుకుపడ్డారు. వెయ్యి కిలోల బాంబులు వదిలారు. దాదాపు 350మంది ఉగ్రవాదులను హతమార్చారు. పాకిస్థాన్ ఊహలకు అందని దాడి ఇది!**

## లక్ష్మీనృసింహునికి బంగారు గరుడసేవ

రాపూరు మండలంలోని పెంచలకోనలో కొలువైవున్న శ్రీ పెనుశిల లక్ష్మీనృసింహ స్వామికి గత నెల 24న ఆలయ అర్చకులు బంగారు గరుడవాహనసేవ నిర్వహించారు. స్వామివారి జన్మనక్షత్రమైన స్వాతి నక్షత్రాన్ని పురస్కరించుకుని ఆదివారం రాత్రి అలంకార మండపంలో స్వామివారికి నయనమనోహరంగా ఈ వేడుక జరిగింది. ఆలయ ప్రధాన అర్చకులు సీతారామయ్యస్వామి, శశిస్వామి, త్రినాథ్‌స్వామి నేతృత్వంలో స్వామివారిని శోభాయమానంగా అలంకరించి విశేష పూజలు నిర్వహించారు. అనంతరం మంగళ వాయిద్యాలు, వేదమంత్రోచ్చటనల మధ్య స్వామివారిని పెంచలకోన వీధుల్లో ఊరేగిస్తూ క్షేత్రోత్సవాన్ని నిర్వహించారు. పెద్దసంఖ్యలో భక్తులు ఈ వేడుకలో పాల్గొని స్వామివార్లను దర్శించుకున్నారు. దేవాదాయ ధర్మాదాయశాఖ ఏ.సి వెంకటసుబ్బయ్య పర్యవేక్షణలో జరిగిన ఈ ఉత్సవానికి ఆలయ మాజీ ఛైర్మెన్ తానంకి నానాజీ, ప్రతిమ ఉభయకర్తలుగా వ్యవహరించారు.

## సాయినాథునికి ప్రత్యేక పూజలు

నెల్లూరు నవాబుపేటలోని రామకృష్ణనగర్‌లో ఉన్న షిర్డీ సాయిబాబా మందిరం 11వ వార్షికోత్సవం సందర్భంగా గతనెల 24న శ్రీ సాయినాధునికి ప్రత్యేక పూజలు చేశారు..విశేష హారతులు, పంచామృత అభిషేకాలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం నిర్వాహకులు భక్తులందరికీ అన్నప్రసాద వితరణ గావించారు. ఉభయకర్తలుగా నాగిశెట్టి బాబురావు, స్వర్ణలత, యనమల కృష్ణయ్య, సుగుణమ్మ దంపతులు వ్యవహరించారు.

## ఉద్యోగ భద్రతకై ఎంపిఇఒల ఆందోళన

తమకు ఉద్యోగ భద్రత కల్పించాలంటూ వ్యవసాయశాఖలో పనిచేస్తున్న ఎంపిఇఒలు నెల్లూరు కలెక్టరేట్ ఎదుట ఆందోళన నిర్వహించారు. గత నెల 23న వారు నిరసనదీక్షలో పాల్గొన్నారు. వ్యవసాయ పట్టభద్రులమైన తమకు ఏఇఒలుగా ప్రమోషన్ ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. 2002లో ఎంపిఇఒల వ్యవస్థ ఏర్పడిందని, మట్టి నమూనాల సేకరణ, విశ్లేషణతో పాటు అనేక అంశాల్లో సలహాలు సూచనలు ఇస్తూ రైతాంగానికి అందుబాటులో ఉంటూ సేవలందిస్తున్నామని, కష్టపడి పనిచేస్తున్న తమకు ఉద్యోగభద్రత కల్పించాలని, ప్రభుత్వం వెంటనే స్పందించి తమను రెగ్యులరైజ్ చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపిఇఒల సంఘం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఎంవి శివప్రసాద్, జిల్లా అధ్యక్షుడు ఎన్. శంకరయ్య, ప్రధాన కార్యదర్శి వై. సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.




## గోయల్‌కు అభినందనలు

కేంద్ర రైల్వేశాఖ మంత్రి పియూష్ గోయల్ ఆణిముత్యంలాంటి నాయకుడు. నీతి, నిజాయితీలకు ప్రతిరూపం. గతంలో విద్యుత్‌శాఖ మంత్రిగా పనిచేసి, దేశంలో కరెంట్ లేని గ్రామం అనేది లేకుండా చేశాడు. ఇప్పుడు రైల్వే మంత్రిగా, ఆ శాఖలో అభివృద్ధి విప్లవం తెస్తున్నాడు. నెల్లూరు పర్యటనలో ఆయన గూడూరు నుండి విజయవాడకు సూపర్‌ఫాస్ట్ రైలును మంజూరు చేయడం ఎంతైనా అభినందనీయం.

**వాసు జానకిరామ్, గూడూరు.**

## దేశద్రోహుల సంగతి చూడాలి

పుల్వామా ఉగ్ర దాడి తర్వాత పాకిస్థాన్‌పై యుద్ధం ప్రకటించాలని చాలామంది ఉద్వేగంతో అభిప్రాయ పడుతున్నారు. పాకిస్థాన్ మన శత్రుదేశం. దాని నుండి వచ్చే ప్రమాదాన్ని ఎదుర్కోవడానికి మనం ఎప్పుడూ సన్నద్ధంగానే ఉంటాం. కాని దేశంలో వున్న ద్రోహులతోనే దేశానికి అసలైన ప్రమాదం పొంచి వుంది. ముందు వీళ్ళ అంతు చూడాలి. ఉగ్రదాడి తర్వాత కూడా కొందరు నాయకులు భారత ప్రభుత్వం మీద అనుమానాలు వ్యక్తం చేయడం, పాకిస్థాన్ మాటలను సమర్ధించడం చూస్తుంటే వీళ్ళు దేశం కంటే కూడా ఓట్ల రాజకీయాలకు ఎక్కువ ప్రాధాన్యతనిస్తున్నట్లుగా వుంది. పురుగులు పడితే పంట ఎలా నాశనం ఎవుతుందో, ఇలాంటి చీడ పురుగుల వల్ల కూడా దేశం నాశనం అవుతుంది. కాబట్టి ఇలాంటి దేశద్రోహ చీడపురుగులను ముందుగా ఏరివేయాలి.

**సి.రాజీవి, నెల్లూరు.**

## మురుగును తొలగించండి

నెల్లూరు, డైకస్‌రోడ్డు సెంటర్‌లోని ఎన్‌సిసి కాలనీలో ఏర్పాటు చేసిన మురుగు కాలువల్లోని సిల్ట్‌ను కార్పొరేషన్ సిబ్బంది దాదాపు రెండు నెలలుగా తీయకపోవడంతో దోమలు అధికమై ఈ ప్రాంతవాసులు నానా ఇబ్బందులు పడుతున్నారు. కార్పొరేషన్ సిబ్బంది తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నాము.

**- ఎం.వి.ఆర్., నెల్లూరు.**

## వాస్తవాల రామచంద్ర

నెల్లూరీయులకు వాస్తు రామచంద్రగా పరిచయస్తులైన వావింటపర్తి రామచంద్ర గారి మృతి బాధాకరం. అందరూ ఆయనను వాస్తు రామచంద్ర అంటారు. కాని, నేను వాస్తవాల రామచంద్రగా భావిస్తాను. ఎందుకంటే 'లాయర్' ప్రజావాణి ద్వారా వాస్తవాలనే ఆయన ప్రస్తావిస్తుంటారు. జాతీయ అంశాలపై ఆయన అభిప్రాయాలు ఎంతో బాగుండేవి. ఇకనుండి ఆయన అభిప్రాయాలు తెలుసుకునే అవకాశం లేకపోవడం బాధాకరం.

**పి.మల్లిఖార్జునరావు, నార్తురాజుపాలెం.**

## మోడీకే పట్టం కట్టాలి

భారత దేశానికి నరేంద్ర మోడీ రూపంలో ఒక సమర్ధుడైన ప్రధాని దొరికాడు. ప్రపంచంలోనే భారత్‌కు ఎనలేని గౌరవం తెచ్చాడు. ప్రపంచాన్నే భారత్‌కు మద్దతుగా నిలిచేలా చేశాడు. ముఖ్యంగా మొన్న పాక్‌పై జరిగిన దాడితో హీరో అయిపోయాడు. మోడీ ఐదేళ్ళ పాలనలో దేశం అన్ని రంగాల్లో ముందుకుపోతోంది. నోట్ల రద్దు, జిఎస్టీ వంటి అంశాల మూలంగా కొన్ని ఒడిదుడుకులు తలెత్తినా అవన్నీ ఒకట్రెండేళ్ళలో సర్దుకుంటాయి. కులాల కోసం, మతాల కోసం, తాత్కాలిక తాయిలాల కోసం మోడీని పోగొట్టుకుంటే దేశం కుక్కలు చించిన విస్తరే అవుతుంది.

**పైడాల రమేష్‌రెడ్డి, ఆత్మకూరు.**



# • వై.యస్. కుటుంబంలో...
# 'మేకపాటి' చిచ్చు

> మా కుటుంబానికి 3 సీట్లు కావాల్సిందే అంటున్న మేకపాటి
> మాగుంటకు ఒంగోలు సీటిస్తే, నా సంగతేందంటున్న వై.వి.సుబ్బారెడ్డి
> మౌనంగా మాగుంట, అయోమయంలో పార్టీ వర్గాలు





***2019 సార్వత్రిక ఎన్నికల తేదీలు దగ్గర పడుతున్న కొద్దీ అన్ని పార్టీల్లో సీట్ల వేడి చిన్నగా మొదలౌతోంది. వై.యస్.ఆర్. కాంగ్రెస్‌పార్టీలో ముఖ్యంగా నెల్లూరు, ప్రకాశం జిల్లాలు ఇప్పుడు చర్చనీయాంశంగా మారాయి. కొత్తగా పార్టీలోకి వచ్చేవారికి ప్రాధాన్యతను కల్పించడంతో పాటు పార్టీ ఆవిర్భావం నుండీ పార్టీనే అంటిపెట్టుకుని వున్నవారికి న్యాయం చేసే విషయంలో పార్టీ అయోమయపరిస్థితులలో పడుతోంది.***

ముఖ్యంగా ప్రకాశం జిల్లాలో తొలినుండీ వై.వి.సుబ్బారెడ్డికి ప్రాధాన్యత ఉంది. దశాబ్దాల కాలంగా బయట జిల్లావాసులు ప్రకాశం జిల్లాలో పోటీ చేయడం జీర్ణించుకోలేక అక్కడ ఓటర్లు గత ఎన్నికల్లో స్థానిక నినాదంతో పోటీ చేసిన వై.వి.సుబ్బారెడ్డికి పట్టం కట్టారు. దివంగత నేత వై.యస్.రాజశేఖరరెడ్డికి తోడల్లుడు, వై.యస్.ఆర్ కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షుడు వై.యస్.జగన్మోహన్‌రెడ్డికి బాబాయి అన్న అంశాలు కూడా ఇక్కడ సుబ్బారెడ్డి విజయానికి దోహదపడ్డాయి. పార్టీ ఓడిపోయినా సుబ్బారెడ్డి మాత్రం ప్రజల మనసుల్లో గెలిచాడు. నిత్యం ప్రజల్లోనే ఉంటూ తాను పార్ట్‌టైం పొలిటీషియన్ కాదనిపించుకున్నాడు. మళ్ళీ కూడా తానే ఢంకా భజాయించి గెలిచే పరిస్థితి కల్పించుకున్నాడు.

సరిగ్గా ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో వై.వి.సుబ్బారెడ్డిపై ఓడిన మాగుంట శ్రీనివాసులురెడ్డి పేరు తెరపైకి వచ్చింది. ఒంగోలు పార్లమెంటు నుండి మాగుంటను వైసిపి అభ్యర్థిగా బరిలో దింపనున్నారని పార్టీ వర్గాలే ప్రకటించడంతో మనస్తాపం చెందిన సుబ్బారెడ్డి అలకబూనాడు. తనను కాదని వేరే అభ్యర్థికి సీటెలా ఇస్తారని బహిరంగంగానే ధ్వజమెత్తాడు.

అయితే సుబ్బారెడ్డి కోరిక న్యాయమైనదే అయినప్పటికీ ఆయన అలా బహిరంగంగా పార్టీని విమర్శించడం మంచిదికాదని పార్టీ వర్గాల భావన. ఈ తరుణంలో మాగుంటను నెల్లూరు వైసిపి అభ్యర్థిగా ఎందుకు నిలపరాదనే వాదన కూడా పార్టీ శ్రేణుల నుండి వస్తోంది. అయితే ఇక్కడే అసలైన సమస్య ఏర్పడుతోంది. తమ కుటుంబానికి ఖచ్చితంగా 3టిక్కెట్లు కావాల్సిందేనని మేకపాటి బృందం పట్టుపడుతోందని సమాచారం. పెద్దాయన ఉదయగిరికి వెళ్లి, తమ్ముడికి ఎమ్మెల్సీ ఇప్పించుకోవచ్చుగా, లేదా ఇప్పుడు వై.వి.సుబ్బారెడ్డికి ఇస్తామని చెప్తున్న రాజ్యసభ పెద్దాయనకే ఇస్తే సమస్య సమసిపోతుంది కదా అన్నది పార్టీ వాదుల వాదన. అయితే మేకపాటి బృందం మాత్రం తమకు 3టిక్కెట్లు కావాల్సిందే అన్న మంకుపట్టు వీడకపోవడం, వీరి డిమాండుకు పార్టీ అధ్యక్షుడు సైతం వంతపాడడం ఎవ్వరికీ మింగుడు పడడం లేదు. మొత్తానికి ఒక్క మేకపాటి టిక్కెట్లతో పార్టీలో సంక్షోభం తొలగిపోయే పరిస్థితి ఉన్నప్పటికీ వాళ్ళు పెద్దమనసుతో ముందుకు రాకపోవడం అందరినీ ఆశ్చర్యపరుస్తోంది.

ఎవరికి వారు తమ స్వార్థానికే పెద్దపీట వేస్తూ తాము గెలిస్తే చాలనుకుంటున్నారు తప్ప తమతో పాటు తమ పార్టీ గెలవాలి, జగన్మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కావాలి అన్న ఆలోచన చేయలేకపోవడం విచారకరమన్న అభిప్రాయం కూడా రాజకీయ మేధావి వర్గాల్లో వినిపిస్తోంది.

## నెల్లూరు దేశం నుండి మాగుంట...?

పిల్లి పిల్లి పోరు కోతి తీర్చిందన్నట్లుగా వై.యస్.ఆర్ పార్టీలో జరుగుతున్న అంతర్గత పోరును తన అవకాశంగా మలచుకుంటున్న తంత్రబాబు వెంటనే పావులు కదిపి మాగుంటను నెల్లూరు పార్లమెంటు దేశం అభ్యర్థిగా పోటీ చేయవలసిందిగా అడిగినట్లు వినికిడి. ఇక్కడ దేశం అభ్యర్థిగా మాగుంట వస్తే అసెంబ్లీ స్థానాలలో కూడా మంచి ఫలితాలు సాధించవచ్చున్నది బాబు ఆలోచన.

రాజకీయ ఆరంగేట్రం చేసినప్పటినుండీ ఇప్పటి వరకూ మాగుంట కుటుంబం నెల్లూరు నుండి బరిలో దిగలేదు కాబట్టి, ఇక్కడ వారి అభ్యర్థిత్వం జిల్లా తెలుగుదేశం పార్టీకి అదనపు ఆకర్షణ కాగలదన్న ధీమా కూడా దేశం శ్రేణుల్లో వినపడుతోంది. ఈ మేరకు మాగుంట శ్రీనివాసులురెడ్డి నెల్లూరుజిల్లా వ్యాప్తంగా వున్న తమ అనుచరులు, అభిమానులను పిలిపించుకుని వారి అభిప్రాయాలను కూడా కోరినట్లు తెలుస్తోంది.

మొత్తానికి మేకపాటి మంకుపట్టు అటు వై.యస్. కుటుంబంలో చిచ్చు పెట్టడమే కాకుండా, ఇటు జిల్లాలో పార్టీకి నష్టాన్ని చేకూర్చబోతుందన్నది రాజకీయ భీష్మాచార్యుల అంచనా.

# మనుషులు కలిశారు..
# మనసులు కలిసేనా?








*ప్రపంచంలో ఏడు వింతల గురించి చెప్పుకుంటుంటారు. ఆ వింతలనేవి శాశ్వతంగా వుంటాయి. కాని, రాజకీయాలలో తాత్కాలిక వింతలు ఏర్పడుతుంటాయి. ఆ వింతలు చూడడానికి ఎంతో అద్భుతంగా వుంటాయి.*

ఇప్పుడు ఇలాంటి అద్భుతాలే నెల్లూరుజిల్లా తెలుగుదేశం పార్టీలో చోటుచేసుకుంటున్నాయి. ఒకే కారులో పక్కపక్క సీట్లలో నిన్నటివరకు నిప్పు-ఉప్పులా వున్న మంత్రులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, పి.నారాయణ, అలాగే ఒకే సభలో పక్కపక్క సీట్లలో సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి - ఆదాల ప్రభాకర్‌రెడ్డిల మంతనాలు.... వీళ్ళ ముగ్గురు కూడా నాలుగున్నరేళ్ళుగా ఒకరంటే ఒకరికి పడదన్నట్లుగా వున్నారు. ఎన్నికలు దగ్గరకొచ్చేసరికి కలిసిపోయారు. ఈ ఎన్నికల్లో ఈ ముగ్గురు కూడా పోటీ చేస్తున్నారు. ఒకరి అవసరం ఒకరికి వుంది. నెల్లూరు నగరంలో నారాయణకు అటు సోమిరెడ్డి, ఇటు ఆదాల మనుషులు పనిచెయ్యాలి. నెల్లూరురూరల్‌లో సోమిరెడ్డి వర్గం ఆదాలకు చెయ్యాలి, సర్వేపల్లిలో ఆదాల వర్గం సోమిరెడ్డికి చెయ్యాలి. ఈ పరస్పర అవసరం దృష్ట్యానే ఒకరికొకరు స్నేహంగా వుంటున్నారు. ఈ స్నేహం ఎన్నికల్లో కూడా పనిచేస్తుందేమో చూద్దాం!?



టిటిడి పాలకమండలి సభ్యులుగా ప్రమాణస్వీకారం చేసిన టిడిపి నాయకుడు వేనాటి రామచంద్రారెడ్డిని ఇటీవల నెల్లూరులో అభినందిస్తున్న రాష్ట్ర వ్యవసాయశాఖా మాత్యులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి



# బాపూజీ కలలను సాకారం చేస్తున్న వెంకయ్య

## - రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ ప్రశంస



స్వర్ణభారత్ ట్రస్ట్ వార్షికోత్సవంలో రాష్ట్రపతి రామ్‌నాథ్‌కోవింద్ దంపతులను సత్కరిస్తున్న ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు - ఉషమ్మ దంపతులు

మనం ఎక్కడున్నా..ఏ స్థాయిలో ఉన్నా మన ఎదుగుదలకు కారణమైన సమాజానికి ఎంతో కొంత తిరిగి ఇవ్వాలని, ఈ విషయంలో ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడే అందరికీ ఆదర్శమని, బాపూజీ కలలు కన్న గ్రామ వికాసాన్ని ఆయన సాకారం చేస్తున్నారని భారత రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడును ప్రశంసించారు. వెంకటాచలంలో ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు స్థాపించిన స్వర్ణభారత్ ట్రస్ట్ 18వ వార్షికోత్సవంలో రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ దంపతులు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. గతనెల 22వ తేది వెంకటాచలంలోని స్వర్ణభారత్ ట్రస్ట్ ఆవరణంలో ఎంతో వేడుకగా జరిగిన వార్షికోత్సవానికి రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ జ్యోతి వెలిగించి ప్రారంభించారు. ఈ సందర్భంగా రాష్ట్రపతి మాట్లాడుతూ దేశానికి ఆంధ్రప్రదేశ్ ఇచ్చిన గొప్ప బహుమతి.. వెంకయ్యనాయుడు అని అంటూ కొనియాడారు. గ్రామీణ ప్రాంతాల్లో విద్య, వైద్యం, స్వయం ఉపాధి రంగాల్లో సుమారు 18 ఏళ్ళుగా సేవలందిస్తున్న స్వర్ణభారత్ ట్రస్ట్ వార్షికోత్సవంలో పాల్గొనడం తనకెంతో ఆనందంగా ఉందన్నారు. వెంకయ్య బహుముఖ ప్రజ్ఞాశాలి అని, అజాతశత్రువని అంటూ ఆయనెన్నో గొప్ప సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని వెంకయ్యనాయుడును అభినందించారు. ఈ సందర్భంగా రాష్ట్రపతి తన ప్రసంగం ప్రారంభంలో తెలుగులో ఒక నిమిషం మాట్లాడి అందరి కరతాళ ధ్వనులందుకున్నారు.

## మానవ సేవే మాధవసేవ - ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు

ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు మాట్లాడుతూ అత్యంత సామాన్యకుటుంబంలో పుట్టి తన స్వశక్తితో దేశ ప్రథమ పౌరుని స్థాయికి ఎదిగిన రామ్‌నాథ్ కోవింద్‌ను ప్రత్యక్షంగా చూడడం ద్వారా ఇక్కడి యువతకు స్ఫూర్తి కలగాలనే ఉద్దేశ్యంతోనే వారిని స్వర్ణభారత్ ట్రస్ట్ వార్షికోత్సవానికి ఆహ్వానించామన్నారు. "నేను నా జీవితంలో ఎన్నో సాధించాను. వాటిలో చెప్పుకోదగ్గది స్వర్ణభారత్ ట్రస్ట్. నా జీవితంలో ఇది ఎంతో సంతృప్తిని కలిగించే కార్యక్రమం" అని సంతోషం వ్యక్తం చేశారు. కష్టించి పని చేయడం ద్వారా అత్యున్నత స్థాయికి ఎదగాలని, ఆ స్ఫూర్తిని ఇక్కడి పిల్లల్లో కలిగించడం కోసం రాష్ట్రపతిని ఆహ్వానించామని అన్నారు. రాష్ట్రపతిని ప్రత్యక్షంగా చూడడం ద్వారా, వారి ప్రసంగం వినడం ద్వారా, వారి జీవిత విశేషాలు తెలుసుకోవాలనే కోరిక కలుగుతుందని, తద్వారా పిల్లలు దేశం గర్వించదగిన పౌరులుగా ఎదుగుతారని ఆకాంక్షిస్తున్నానని అన్నారు. తన కుమార్తె దీపా వెంకట్, కుమారునితో పాటు ప్రముఖ పారిశ్రామికవేత్త విష్ణురాజు వీరంతా తన నుంచి రాజకీయాలను వారసత్వంగా తీసుకోకుండా సేవాభావాన్ని స్వీకరించినందుకు గర్విస్తున్నానన్నారు. ప్రతిఒక్కరూ ఎంతో కొంత సమయాన్ని, సంపదను సమాజం కోసం వెచ్చించాలని, గ్రామీణ ప్రజలకు సేవ చేస్తే భగవంతునికి సేవ చేసినట్లేనన్నారు. మానవసేవే మాధవసేవ అనే విషయాన్ని గుర్తించాలన్నారు. తొలుత స్వర్ణభారత్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ దీపావెంకట్ స్వాగతోపన్యాసం చేయగా, ట్రస్ట్ ఛైర్మెన్ కెవి విష్ణురాజు సభకు కృతజ్ఞతలు చెప్పూ వందన సమర్పణ చేశారు. ఈ సందర్భంగా ప్రసిద్ధ కళాకారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ బాగా ఆకట్టుకున్నాయి. అనంతరం రాష్ట్రపతి దంపతులను ఉపరాష్ట్రపతి దంపతులు ఘనంగా సత్కరించారు. ఈ వార్షికోత్సవ వేడుకల్లో రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్సీ మాగుంట శ్రీనివాసులురెడ్డి, సిబిఐ విశ్రాంత జె.డి లక్ష్మీనారాయణ తదితరులతో పాటు పలువురు ఎమ్మెల్యేలు, ప్రజా ప్రతినిధులు, వివిధ రంగాల్లోని ప్రముఖులు పాల్గొన్నారు. అనంతరం స్వర్ణభారత్ ట్రస్ట్ తరపున రాష్ట్రపతి దంపతులను ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు సన్మానించి వారికి రాష్ట్రపతి చిత్రపటాన్ని బహుమతిగా అందజేశారు.



స్వర్ణభారత్ ట్రస్ట్‌లో ఉచిత వైద్యశిబిరాన్ని ప్రారంభిస్తున్న ఉపరాష్ట్రపతి యం.వెంకయ్యనాయుడు

## అక్షర విద్యాలయం సందర్శన

ఈ పర్యటనలో భాగంగా తొలుత రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడుతో కలిసి వెంకటాచలం సమీపంలోని సరస్వతినగర్‌లో ఉన్న అక్షర విద్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా విద్యాలయం విద్యార్థులు వారిని ఘనంగా స్వాగతించారు. రాష్ట్రపతి అక్కడ సర్దార్ వల్లభాయ్‌పటేల్ విగ్రహాన్ని సందర్శించి ఘననివాళులర్పించి, విద్యాలయం ప్రాంగణంలో మొక్కలు నాటారు. అనంతరం స్వర్ణభారత్ ట్రస్ట్ వార్షికోత్సవ వేడుకల్లో పాల్గొన్నారు. ఆ తర్వాత రాష్ట్రపతి దంపతులకు ఉపరాష్ట్రపతి దంపతులు ఆత్మీయమైన విందు ఏర్పాటుచేసి నెల్లూరు వంటకాలను కొసరికొసరి వడ్డించారు.

## రాష్ట్రపతికి ఘనస్వాగతం

నెల్లూరు పోలీస్‌పెరేడ్ గ్రౌండ్‌లోఉదయం 9.40గంటలకు.. తొలిసారిగా సింహపురి గడ్డపై అడుగిడిన రాష్ట్రపతి దంపతులకు ఘనస్వాగతం లభించింది. భారతదేశ ప్రథమ పౌరుడు..రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ హెలికాప్టర్ నుంచి దిగగానే గవర్నర్ ఇఎస్ఎల్ నరసింహన్‌తోపాటు, మంత్రులు అమర్‌నాథరెడ్డి, సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, నగర మేయర్ అబ్దుల్ అజీజ్, గుంటూరు రేంజ్ ఐజీ ఆర్‌కె మీనా, జిల్లా కలెక్టర్ ఆర్. ముత్యాలరాజు, ఎస్పీ ఐశ్వర్య రస్తోగి, మాజీమంత్రి కామినేని శ్రీనివాసరావు, స్వర్ణభారత్ ట్రస్ట్ సభ్యులు వారికి ఘనస్వాగతం పలికారు. స్వర్ణభారత్ ట్రస్ట్ వార్షికోత్సవంలో పాల్గొన్న అనంతరం రాష్ట్రపతి దంపతులు తిరిగి మధ్యాహ్నం 1.20 గంటలకు హెలికాప్టర్‌లో చెన్నైకి బయలుదేరి వెళ్ళారు. రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి జిల్లా పర్యటన సందర్భంగా ఉన్నతాధికారులు, జిల్లా పోలీసు యంత్రాంగమంతా ఆయా ప్రాంతాల్లో అప్రమత్తంగా ఉంటూ వేలాదిమంది పోలీసులతో అడుగడుగునా కట్టుదిట్టమైన భారీ బందోబస్తుతో పటిష్టమైన భద్రతా ఏర్పాట్లను చేపట్టారు.

# జిల్లా కేంద్ర గ్రంథాలయ నిర్మాణానికి భూమిపూజ

## - 3 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్నామన్న మంత్రి నారాయణ



నెల్లూరు నగరంలో 3 కోట్ల రూపాయల వ్యయంతో కేంద్ర గ్రంథాలయాన్ని నిర్మాణం గావిస్తున్నామని రాష్ట్ర పురపాలకశాఖ మంత్రి పొంగూరు నారాయణ చెప్పారు. రాష్ట్రానికే ఇది మోడల్ గ్రంథాలయంగా ఉండేలా నిర్మిస్తున్నామన్నారు. గత నెల 24న నెల్లూరు, స్టోన్‌హౌస్‌పేట రేబాలవారివీధిలో ఉన్న జిల్లా కేంద్ర గ్రంథాలయ నూతన భవనానికి మంత్రి నారాయణ భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పుస్తక పఠనం మరువలేనిదన్నారు. అభివృద్ధి చెందిన దేశాలు శాస్త్ర సాంకేతిక రంగాల్లో ముందంజలో ఉన్నప్పటికీ అక్కడి ప్రజలు పుస్తక పఠనాన్ని మరువలేదని, బస్సులు, రైలు ప్రయాణాల్లో తరచూ పుస్తకపఠనం చేస్తుంటారని అన్నారు. కంప్యూటర్లు, అంతర్జాలంతో కావాల్సిన సమాచారాన్ని పొందవచ్చుని, అయితే పుస్తకపఠనం ద్వారా జ్ఞానసముపార్జనకు ఎంతగానో అవకాశం ఉందని చెప్పారు. రాష్ట్రం మొత్తమ్మీద 1900కు పైగానే గ్రంథాలయాలున్నాయని, నెల్లూరులో 63 గ్రంథాలయాలున్నాయంటూ జిల్లా కేంద్ర గ్రంథాలయంలో 64,911 పుస్తకాలు పాఠకులకు అందుబాటులో ఉన్నాయన్నారు. అత్యాధునిక వసతులతో ఈ కేంద్ర గ్రంథాలయాన్ని ఏర్పాటు చేస్తున్నా మని, పుస్తక విభాగంతో పాటు డిజిటల్ గ్రంథాలయాన్ని కూడా నెలకొల్పుతున్నా మని తెలిపారు.

రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి మాట్లాడుతూ ఇక్కడున్న పాతభవనంలోని కలపను సద్వినియోగం చేసుకుని గ్రంథాలయం పూర్వవైభవం చెక్కుచెదరకుండా ఉండేలా కొత్త భవనాన్ని నిర్మించాలని సూచించారు. జిల్లా గ్రంథాలయసంస్థ ఛైర్మెన్ కిలారి వెంకటస్వామినాయుడు మాట్లాడుతూ 9నెలల్లో అత్యాధునిక గ్రంథాలయాన్ని జిల్లావాసులకు అందిస్తామన్నారు. రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ ఛైర్మెన్ దాసరి రాజా మాట్లాడుతూ త్వరలో గ్రంథాలయ సిబ్బందిని అవుట్‌సోర్సింగ్ విధానంలో భర్తీ చేయనున్నామన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మహిళా కార్పొరేషన్ ఛైర్మెన్ తాళ్లపాక అనూరాధ, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర, నుడా ఛైర్మెన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, మాజీఎమ్మెల్యే ముంగమూరు శ్రీధర కృష్ణారెడ్డి, కార్పొరేటర్లు శైలజ, సత్యనారాయణ, ఉచ్చి భువనేశ్వరిప్రసాద్ తదితరులతో పాటు గ్రంథాలయసంస్థ ఉద్యోగులు సిబ్బంది పాల్గొన్నారు.

# ఎన్నికల యుద్ధానికి సిద్ధంకండి



ఎన్నికల నిర్వహణపై జిల్లా అధికారులతో చర్చిస్తున్న జిల్లా కలెక్టర్ ముత్యాలరాజు

జిల్లాలో స్వేచ్ఛగా, ప్రశాంతంగా ఎన్నికలు నిర్వహించేందుకు పటిష్టమైన భద్రతా ప్రణాళికలను సిద్ధం చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ రేవు ముత్యాలరాజు ఎన్నికల అధికారులను ఆదేశించారు. ఫిబ్రవరి 23న నెల్లూరులోని తన క్యాంప్ కార్యాలయంలో జిల్లా ఎస్పీ ఐశ్వర్య రస్తోగి, తిరుపతి పార్లమెంట్ రిటర్నింగ్ అధికారి, సంయుక్త అధికారి కె. వెట్రిసెల్విత్తో కలసి 10 నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులతో ఎన్నికల భద్రతా ఏర్పాట్లపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లాలో స్వేచ్ఛాయుత వాతావరణంలో ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించాల్సి ఉందని, ఇందుకోసం భారత ఎన్నికల సంఘం రూపొందించిన రిటర్నింగ్ అధికారుల కరదీపిక, సూచనలు, ప్రిసైడింగ్ అధికారుల కరదీపికలను అధికారులు తప్పనిసరిగా అధ్యయనం చేయాలని చెప్పారు. ఎవరైనా రౌడీషీటర్‌గా ఉండి, ఓటర్లను ఓటు వేయకుండా బెదిరించడం జరిగే పక్షంలో అలాంటి వారిని చట్టప్రకారం అదుపులోకి తీసుకోవడం జరుగుతుందన్నారు. జిల్లా ఎస్పీ ఐశ్వర్య రస్తోగి మాట్లాడుతూ పోలీసు, రెవెన్యూ అధికారులు ఉమ్మడిగా గ్రామాల్లో విచారించి సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించాలన్నారు. ప్రతి నియోజకవర్గంలో నలుగురు పెద్ద నాయకులు ఉంటారని, వారిపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు.



# క్షేమంగా వెళ్లి సంతోషంగా రండి

## పోలవరం బస్సులకు పచ్చజెండా ఊపిన సోమిరెడ్డి రాజు

ఫిబ్రవరి 25వ తేదీన టిపిగూడూరు నుండి పోలవరం ప్రాజెక్ట్ సందర్శనార్థం బయలుదేరిన ఐదు బస్సులకు సర్వేపల్లి నియోజకవర్గ టిడిపి సమన్వయకర్త సోమిరెడ్డి రాజగోపాలరెడ్డి పసుపుజెండా ఊపారు. బస్సుల్లోకి వెళ్లి ఆయన అందరికీ ప్రయాణ శుభాకాంక్షలు తెలిపారు. పోలవరం ప్రాజెక్ట్ సందర్శన మీ మనస్సులో ఒక తీపి జ్ఞాపకంగా మిగిలిపోవాలని ఆకాంక్షించారు.

# కోవూరు... పెరిగిన సీటు పోరు!



కోవూరు తెలుగుదేశం టిక్కెట్ ఎవరిదనే దానిపై ఆసక్తికర వాతావరణం నెలకొంది. ఈ సీటు వ్యవహారం అధినేత చంద్రబాబుకే తలనొప్పిగా మారినట్లు తెలుస్తోంది. సిటింగ్ ఎమ్మెల్యే పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి మళ్లీ కూడా సీటు నాదే అనే ధీమాతో ఉన్నాడు. సీటు కోసం తన ప్రయత్నాలు తాను చేసుకుంటున్నాడు.

ఇక 2014లో ఈ సీటును పోలంరెడ్డి కోసం వదులుకున్న పెళ్లకూరు శ్రీనివాసులురెడ్డి ఈసారి వెనక్కు తగ్గడం లేదు. 2019లో సీటు నాకే ఇస్తానని మాటిచ్చారు. అందుకే 2014లో వదులుకున్నా, ఈసారి వెనక్కి తగ్గేది లేదు. బ్యాలెట్‌లో నా పేరు ఖచ్చితంగా ఉంటుందంటూ పంతం పట్టాడు. సిటింగ్ ఎమ్మెల్యే పోలంరెడ్డిపై వ్యతిరేకత వుందని, తనకైతే ఆ సమస్య లేదని, సీటును గెలుచుకుని వస్తానని ధైర్యంగా చెబుతున్నాడు. అంతేకాదు, ప్రచారం కూడా మొదలుపెట్టేసాడు. పెళ్లకూరును దారిలో పెడదామని చంద్రబాబు పిలిపించుకుని మాట్లాడాడు. కోవూరు తనకు ఇవ్వాల్సిందేనని పెళ్లకూరు పట్టు బట్టడంతో అక్కడ సర్వే నిర్వహించి ఎవరు బెటర్ అని తేలితే వారికే టిక్కెట్ ఇస్తామని చంద్రబాబు హామీ ఇచ్చాడు. అంతేకాదు, చెప్పిన అరగంటలోనే కోవూరు అభ్యర్థిగా ఎవరు కావాలనుకుంటున్నారు అని పోలంరెడ్డి, పెళ్లకూరు పేర్లను ఐవిఆర్ఎస్ ద్వారా వదిలారు.

వీళ్లిద్దరి వ్యవహారం ఇలావుంటే పెన్నా డెల్టా కమిటీ ఛైర్మెన్ యర్రంరెడ్డి గోవర్ధన్ రెడ్డి, టిడిపి జిల్లా ప్రధానకార్యదర్శి చేజర్ల వెంకటేశ్వరరెడ్డిలు కూడా తెరమీద కొచ్చారు. వాళ్లిద్దరు కూడా పార్టీకి చాలా ఏళ్ళ నుండి సేవ చేస్తున్నామని, కోవూరు టిక్కెట్ తమకే కేటాయించాలని ఎవరికి వాళ్ళు అడుగుతున్నారు.

మొత్తానికి కోవూరు టిక్కెట్‌కు తీవ్ర పోటీవున్నా పోలంరెడ్డి, పెళ్లకూరులలో ఒకరు అభ్యర్థి కాగలరు. అభ్యర్థి ఏ శీనయ్య అవుతాడో త్వరలోనే తేలనుంది.

# ఉరేసిన వాళ్లే ఊపిరి పోస్తానంటున్నారు

## రెండ్రోజుల జాతరగా కాంగ్రెస్ భరోసాయాత్ర



భరోసా యాత్రలో మాట్లాడుతున్న పిసిసి అధ్యక్షుడు రఘువీరారెడ్డి

ఏ పార్టీ అయితే విభజన పేరుతో ఆంధ్రప్రదేశ్ ఊపిరి తీసిందో, ప్రత్యేకహోదా అంశాన్ని విభజన చట్టంలో చేర్చకుండా ఆంధ్రులను మోసం చేసిందో... అదే పార్టీ ఇప్పుడు మేం అధికారంలోకి వస్తే ఏపికి ప్రత్యేకహోదా ఇస్తామంటూ భరోసా యాత్రను మొదలుపెట్టింది. తిరుపతి నుండి మొదలుపెట్టిన ఈ యాత్ర 23వ తేదీ నెల్లూరుజిల్లాలోని వెంకటగిరి వద్ద ప్రవేశించింది. అయితే అక్కడ వైసిపి నాయకుడు కె.రాంప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో ఈ యాత్రను అడ్డుకోవడంతో కొంత రభస చోటుచేసుకుంది. ఈ యాత్రను అడ్డుకోవాల్సినంత సీన్ లేదు. యాత్రను అడ్డుకోవాలని వైసిపి నాయకత్వం పిలుపునివ్వలేదు. మరి ఇక్కడే యాత్రను ఎందుకు అడ్డుకున్నారో అంతుబట్టని విషయం. భరోసా యాత్ర వెంకటగిరి నుండి బయలుదేరి గూడూరు మీదుగా ఆరోజు రాత్రి నెల్లూరుకు చేరుకోగా, నెల్లూరు నగర కాంగ్రెస్ ఇన్‌ఛార్జ్ చేవూరు దేవకుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా స్వాగత కార్యక్రమాలు, ర్యాలీ జరిగింది. 24వ తేదీ ఉదయం నెల్లూరు నుండి బయలుదేరిన భరోసాయాత్ర బుచ్చి, సంగం, ఆత్మకూరు, వింజమూరు, కలిగిరి మార్గాలలో కావలి వరకు సాగింది. పలుచోట్ల ఏర్పాటు చేసిన సభల్లో కాంగ్రెస్ నాయకులు బీజేపీ, వైసిపిలపై బాగా విమర్శలు చేశారు. చంద్రబాబును, తెలుగుదేశం ప్రభుత్వాన్ని పల్లెత్తు మాట అనలేదు. తాము కేంద్రంలో అధికారంలోకి వస్తే మాత్రం ఏపికి ప్రత్యేకహోదా ఇస్తామని చెప్పారు. విభజన చట్టంతో ఏపికి ఉరేసి, రేపు ఊపిరి పోస్తారంట!

ఈ యాత్రలో పిసిసి అధ్యక్షులు రఘువీరారెడ్డితోపాటు, మాజీ కేంద్రమంత్రులు పనబాక లక్ష్మి, పల్లంరాజు, మాజీమంత్రి కనుమూరు బాపిరాజు, డిసిసి అధ్యక్షులు పనబాక కృష్ణయ్య, చేవూరు దేవకుమార్‌రెడ్డి, శీలం తిరుపయ్య, ఉడతా వెంకట్రావ్, పి.చెంచలబాబుయాదవ్, పత్తి సీతారాంబాబు తదితరులు పాల్గొన్నారు.




90వ పుట్టినరోజు శుభాకాంక్షలు

నాడి తెలుసుకున్నావు...
మాకు జీవనాడివయ్యావు...
వైద్యరంగంలో కీర్తిశిఖరమయ్యావు...
పేదల గుండెల్లో ప్రాణదాతవయ్యావు...
ఏడు దశాబ్దాలుగా వైద్యరంగాన ప్రజల కోసమే నిలిచావు.
మా కుటుంబ అభ్యున్నతికి దోహదపడిన మా ఆత్మీయ వైద్యరత్నం
డాక్టర్ సి.ఆర్.రెడ్డి గారికి
90వ జన్మదిన శుభాకాంక్షలు.

చిల్లకూరు సుధీర్‌రెడ్డి - ప్రసూన
చిల్లకూరు ప్రదీప్‌రెడ్డి, B.Tech - స్మిత
రుచిర విశృత్
డాక్టర్ చిల్లకూరు మోహర్మణి, M.A, M.Phil, PHD
బొమ్మిరెడ్డి సునీల్‌రెడ్డి, B.Tech - సాయిచైతన్య
నిషిత ధ్రువ్
డాక్టర్ రాకేష్‌రెడ్డి, M.S, MCH(CT Surgeon) - డాక్టర్ గాయత్రి, M.S., MRCOG
సాన్వి
డాక్టర్ చెరుకూరు జనార్ధన్‌రెడ్డి, M.S., DNB - డాక్టర్ చెరుకూరు రోహిణి, M.B.B.S
డాక్టర్ చెరుకూరు రామ్‌కిరణ్‌రెడ్డి, M.S., DNB, MRCS - డాక్టర్ స్వాతి, M.S., DGO
అన్వయ్
గౌతమ్, B.Tech, MBA - సాయిదీప్తి, M.A, ఫ్యాషన్ డిజైనర్
అద్వైత్ అనన్య

# నెల్లూరు కబుర్లు



సంబరాలు జరుపుకుంటున్న ఏబివిపి కార్యకర్తలు

## సర్జికల్ సంబరాలు

ఫిబ్రవరి 26వ తేదీ తెల్లారుజామున పాక్ ఆక్రమిత కాశ్మీర్‌లోని ఉగ్ర స్థావరాలపై భారత వైమానిక దళం చేసిన దాడులతో నెల్లూరు నగరంలో సంబరాలు చోటుచేసుకున్నాయి. తెల్లారుజామున జరిగిన సంఘటన కావడంతో పత్రికల్లో రాలేదు. ఉదయాన్నే న్యూస్ ఛానెల్స్ పెట్టే అలవాటు జనాలకు లేదు. కాని, అందరూ స్మార్ట్‌ఫోన్‌లు తీసి ఫేస్‌బుక్, ట్విట్టర్ లాంటివి ఓపెన్ చేస్తుంటారు. సోషల్ మీడియాలో పిఓకెపై భారత్ బాంబుల దాడి వంటి బాంబులాంటి వార్తతో నెల్లూరీయులు ఆశ్చర్యానికి గురయ్యారు. ఆనందంతో టీవీలు ఆన్‌చేసి న్యూస్ ఛానెల్స్‌లో దాడికి సంబంధించిన వార్తా విశేషాలను చూస్తూ టీవీలకు అతుక్కుపోయారు. ఏబివిపి, విశ్వహిందూ పరిషత్ కార్యకర్తలు జాతీయ జెండాలతో నగరంలో ప్రదర్శన నిర్వహించారు. బాణాసంచా కాల్చారు. ఫోటో, వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ వాళ్ళు విజయోత్సవం నిర్వహించారు. మాజీ సైనికోద్యోగులు కూడా ఈ సంబరాల్లో పాల్గొన్నారు.

## ఈ వేసవి చాలా హాట్ గురు...

ఇప్పుడే ఫిబ్రవరి నెల దాటి మార్చిలోకి అడుగు పెట్టాం. ఫిబ్రవరి మూడోవారం నుండే జిల్లాలో ఎండలు సుర్రుమంటున్నాయి. ఎండాకాలం మొన్న పోయినట్లుంది. అప్పుడే మళ్ళీ వచ్చేసింది. ఈ సీజన్‌లో వర్షాలు కూడా పడకపోయె... భూమి చల్లపడక పోయె.. ఉష్ణోగ్రతలు అప్పుడే 37, 38డిగ్రీలుంటు న్నాయి. మార్చిలోనే ఎండలు ఇట్లుంటే... ఇక ఏప్రిల్, మే నెలల్లో ఎట్లా వుంటాయో!

## సిపిఓగా విజయలక్ష్మి

జిల్లా ముఖ్య ప్రణాళికాధికారిగా జె.విజయలక్ష్మి నియమితులయ్యారు. విజయనగరం జిల్లా సిపిఓగా పనిచేస్తున్న ఆమె ఇక్కడకు బదిలీ కాగా, ఇక్కడ సిపిఓగా విధులు నిర్వహిస్తుండిన పిబికె మూర్తి గుంటూరు జిల్లా సిపిఓగా బదిలీ అయ్యారు.

### రోడ్డు మీద దుమ్మెత్తి..

## నెత్తిన పోస్తున్నారు!



నెల్లూరు నగరంలో రోడ్లు క్లీన్ చేసే స్వీపర్ మిషన్‌లు తిరుగుతున్నాయి. రోడ్లపై వున్న మట్టిని అవి చిమ్ముతున్నాయి. అయితే రోడ్డు మీద ధుమ్మును మిషన్‌లోనే స్టాక్ చేసే పద్ధతి లేదు. క్రింద ఊడ్చిన ధుమ్ము గొట్టం ద్వారా గాల్లోకి లేస్తుంది. తిరిగి జనాల నెత్తిన, రోడ్ల మీదే పడుతుంది. ఈ మాత్రం దానికి ఆ మిషన్‌లతో రోడ్లు ఊడ్చడం దేనికి. రోడ్డు క్లీనింగ్ అంటే... రోడ్డు మీద ధుమ్ము అంతా మిషన్ ద్వారా బ్యాగుల్లో నింపి దానిని కంపోస్ట్‌యార్డ్‌కు పంపించాలి. ఇలా చేస్తే రోడ్ల మీద ధుమ్ము క్రమంగా తగ్గిపోతుంది. క్రింద వున్న ధుమ్మును గాల్లోకి వదిలే దానికి ఈ మిషన్‌లు ఎందుకు... దండగ!

## ఆకట్టుకున్న మాడరన్ ఇన్నోవేటివ్



పూర్వీకులు వాడిన వస్తువులతో చిన్నారులు

నెల్లూరు నగరంలోని మాడరన్ స్కూల్లో ఈనెల 24న ఏర్పాటుచేసిన ఇన్నొవేటివ్ మ్యూజియం విద్యార్థులం దరినీ బాగా ఆకట్టుకుంది. సుమారు 150 సంవత్స రాల నుండి ఇటీవల వరకు వినియోగించిన వివిధ రకాల వస్తువులను ఇక్కడ ప్రదర్శించారు. మన పూర్వీ కులు వాడిన వస్తువులు, వాటి విశిష్టతను ఈతరం విద్యార్థులకు తెలియజేసేందుకు, కాలక్రమంలో ఆనాటి వస్తువులు, ఇప్పటి వస్తువుల ఎలా మారుతున్నాయో విద్యార్థులు గ్రహించేందుకు ఈ మ్యూజియం ఏర్పాటుచేశామని నిర్వాహకులు చెప్పారు. స్కూల్ కరెస్పాండెంట్ వాకాటి విజయకుమార్‌రెడ్డి పర్య వేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్‌తో పాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### ముద్రణరంగ పితామహుడి

## విగ్రహ ఆవిష్కరణ



గూటెన్‌బర్గ్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న నెల్లూరు ప్రింటర్స్

ముద్రణ యంత్ర సృష్టికర్త జోహన్నాస్ గూటెన్‌బర్గ్ విగ్రహాన్ని ఫిబ్రవరి 24వ తేదీన నెల్లూరు, రాయాజీ వీధి సెంటర్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నెల్లూరు ప్రింటర్స్ అసోసియేషన్ వారు రక్తదాన శిబిరాన్ని కూడా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రింటర్స్ అసోసియేషన్ జాతీయ అధ్యక్షులు అశోకన్, రాష్ట్ర అధ్యక్షులు సాంబశివరావు, దక్షిణ భారత అధ్యక్షులు ఆర్.ఉదయ్‌కుమార్, కార్పొరేటర్లు పిట్టి సత్యనాగేశ్వరరావు, వేలూరు సుధారాణి, ప్రింటర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు గుండాల ప్రతాప్‌రెడ్డి, కార్యదర్శి అంబటి శ్రీనివాసులు, గౌరవాధ్యక్షులు కె.మల్లిఖార్జున, స్థానిక వైసిపి నాయకులు వేలూరు మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## విఆర్‌కు ఏ-గ్రేడ్

నెల్లూరు విఆర్‌కాలేజీలో 2018-19 సంవత్స రానికి అకడమిక్ ఆడిట్ జరిగింది. కమిషనర్ ఆఫ్ కాలేజియేట్ ఎడ్యుకేషన్ వారి ఉత్తర్వుల మేరకు గతనెల 25-26 తేదీల్లో ఈ ఆడిట్ నిర్వహించారు. అకడమిక్ అడ్వయిజర్లుగా డా.ఎస్ విజయుల్‌రెడ్డి, డా. వై.వెంక టేశ్వర్లు పాల్గొని కోఆర్డినేటర్ డా.బి.సురేంద్ర ఆధ్వర్యంలో ఆడిట్ నిర్వహించి సంబంధిత నియమ నిబంధనలను వివరించారు. అధ్యాపకుల అకడమిక్ రికార్డులను పరిశీలించారు. భవిష్యత్‌లో విద్యార్థులను తీర్చిదిద్దడంలో అధ్యాపకులు తీసుకోవాల్సిన జాగ్రత్త లను సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ డా. అశోక్ రావు, వైస్ ప్రిన్సిపాల్ డా.ఎం.సుబ్రహ్మణ్యం, ఎన్‌ఎసిసి కోఆర్డినేటర్ డా.టి.వెంకటేశ్వర్లుతో పాటు పలువురు సీనియర్ అధ్యాపకులు పాల్గొన్నారు. ఆడిట్ అనంతరం విఆర్ కళాశాలకు ఏ-గ్రేడ్ లభించింది.

## ప్రజల మనిషి సేతురామిరెడ్డి

### - హైకోర్టు న్యాయవాది పట్టాభి



సభలో మాట్లాడుతున్న వేములపాటి పట్టాభి

నిరంతర ప్రజల కోసం, ప్రజా సమస్యలపై పనిచేస్తూ సామాన్యుడిలా జీవించిన ప్రజానేత గండవరం సేతురామిరెడ్డి నేటి తరానికి ఆదర్శ ప్రాయుడని హైకోర్టు న్యాయవాది వేములపాటి పట్టాభి పేర్కొన్నారు. నెల్లూరు రైల్వేఫీడర్స్ రోడ్డులోని రామ కోటయ్య భవన్‌లో సిపిఐ నేత సేతురామిరెడ్డి 6వ వర్ధంతి గత నెల 24న జరిగింది. తొలుత ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పట్టాభి మాట్లాడుతూ నవాబుపేట ప్రాంతంలో ఎవరికి ఏ సమస్య వచ్చినా ముందుండి వాటిని పరిష్కరించడంతో పాటు పేదల సంక్షేమం కోసం సేతురామిరెడ్డి ఎనలేని కృషి చేశారని తెలిపారు. నెల్లూరు కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ ఛైర్మెన్ అరిగెల నాగేంద్రసాయి, సిపిఐ జిల్లా కార్యదర్శి ప్రభాకర్, సామాజిక కార్యకర్త తిక్కవరపు సుకుమార్‌రెడ్డి, ఆంజనేయులు, యాటా శీనయ్య, శ్రీనివాసులురెడ్డి, రోసిరెడ్డి, దయాశంకర్, నాగేంద్ర, చెంగయ్య, రమణయ్య తదితరులు పాల్గొన్నారు.



## మూలాపేట శివాలయం

## బ్రహ్మోత్సవాలు

నెల్లూరు మూలాపేటలోని భువనేశ్వరీ సమేత మూలస్థానేశ్వరస్వామి దేవస్థానంలో ఫిబ్రవరి 27వ తేదీ సాయంత్రం అంకురార్పణతో బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. 28వ తేదీ ధ్వజారోహణ, సింహవాహన సేవ కార్యక్రమాలు జరిగాయి. మార్చి 1న పురుషామృగ సేవ, 2న శేషవాహన సేవ, 3న వెండి రావణసేవ, 4న మహాశివరాత్రి సందర్భంగా ఉదయం గిన్నెభిక్ష, రాత్రి 10గంటలకు లింగోద్భవం, ఒంటి గంటకు వెండి నందిసేవ, 5వ తేదీ రాత్రి 7గంటలకు కళ్యాణం, 10గంటలకు వెండినంది సేవ, 6వ తేదీ ఉదయం 10గంటలకు రథోత్సవం, 7వ తేదీ పులివాహనసేవ, 8వ తేదీ రాత్రి అలకలతోపు, 9వ తేదీ ఉదయం తీర్థవాది, రాత్రి తిరుచ్చి ఉత్సవం, ధ్వజావరోహణం, 10వ తేదీ ఉదయం దవనోత్సవం, 11వ తేదీ ఉదయం ఏకాంతసేవ జరుగనున్నాయి.

## ఆకట్టుకున్న అష్టావధానం



అవధాని మురళితో బలరామయ్యనాయుడు, పృచ్ఛకులు

పద్యసారస్వత పరిషత్ నెల్లూరుజిల్లా శాఖ, ప్రపంచ తెలుగుసమాఖ్య రీజనల్ ఛైర్మెన్ నలుబోలు బలరామయ్యనాయుడు ఆధ్వర్యంలో గత నెల 23న నెల్లూరు పురమందిరం ప్రాంగణంలోని రేబాల లక్ష్మీనరసారెడ్డి (జూనియర్) స్మారకమందిరంలో జరిగిన అష్టావధానం కార్యక్రమం అందరినీ బాగా ఆకట్టుకుంది. ప్రముఖ అవధాని, అవధాన కళానిధి బిరుదాంకితుడు ఆముదాల మురళి సుమారు రెండు గంటల పాటు అష్టావధానం కార్యక్రమాన్ని అమో ఘంగా నిర్వహించి అందరి ప్రశంసలు అందుకున్నారు. ఈ కార్యక్రమానికి పోలవరపు లక్ష్మీనరసింహారావు అధ్యక్షత వహించగా, నలుబోలు బలరామయ్య నాయుడు సభను ప్రారంభించారు. ప్రముఖ సారస్వత వేత్త డా. సూరం శ్రీనివాసులు సభాసంచాలకులుగా వ్యవహరించారు. కొండపి మురళీకృష్ణ (నిషిద్ధాక్షరి), డాక్టర్ ఐనవోలు చక్రపాణి (దత్తపది), అగస్త్యరాజు సుబ్బారావు (సమస్య), ఊరిబిండి వేంకటసుబ్రహ్మణ్య శాస్త్రి (న్యస్తాక్షరి), ఎస్.శ్రీనివాసకుమార్(వర్ణన), పాతూరు అన్నపూర్ణ (ఆశువు), ఆలూరి శిరోమణిశర్మ (పురాణ పఠనం), డాక్టర్ చీమకుర్తి వేంకటేశ్వరరావు (అప్రస్తుత ప్రసంగం) పృచ్ఛకులుగా పాల్గొని అష్టావధానాన్ని రక్తికట్టించి అందరి కరతాళధ్వనులు అందుకున్నారు. అనంతరం అవధాని మురళిని, పృచ్ఛకులను నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. ప్రపంచ తెలుగుసమాఖ్య సభ్యులు ఎస్‌వి రమేష్, ఎస్. మురళీమోహన్ తదితరులు పాల్గొన్నారు.

## జాతీయస్థాయిలో ఉత్తమవైద్యుడిగా డాక్టర్ రవికుమార్




అవార్డునందుకుంటున్న డాక్టర్ రవికుమార్

దాదాపు 30ఏళ్ళుగా చిన్నపిల్లల వైద్యరంగంలో ఎనలేని కృషి చేసినందుకు నెల్లూరు పొగతోటలోని రిచ్ మల్టీస్పెషాలిటీ హాస్పిటల్ అధినేత డాక్టర్ టి.రవికుమార్ జాతీయ ఉత్తమ వైద్యుడు అవార్డునందుకున్నారు. గత నెల 23న హైదరాబాద్‌లోని హోటల్ ఖత్రియాలో నేషనల్ బోర్డ్ ఆఫ్ ఎగ్జామిన్స్ డిఎన్‌బి వారి ఆధ్వ ర్యంలో దేశంలోని ప్రముఖ వైద్యుల సదస్సులో న్యూఢిల్లీ ఎన్‌బిఇ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ లక్ష్మీకాంత్‌దేవ్ చేతులమీదుగా ఈ అవార్డును అందుకున్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథులుగా న్యూఢిల్లీ ఎన్‌బిఇ గవర్నింగ్ బాడీ మెంబర్ డాక్టర్ అలెగ్జాండర్ థామస్, అల్యూమినియం నేషనల్ కో-ఆర్డినేటర్ డాక్టర్ క్రూబ్‌చందల్‌లు పాల్గొన్నారు. ఈమేరకు గత నెల 25న రిచ్ మల్టీస్పెషాలిటీ హాస్పిటల్ సెమినార్ హాల్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో డాక్టర్ టి.రవికుమార్ మాట్లాడుతూ పురిటిపిల్లలు, చిన్నపిల్లలకు సంబంధించిన 100 పడకల హాస్పిటల్ రిచ్ మల్టీస్పెషాలిటీ హాస్పిటల్‌లోనే ఉందన్నారు. జాతీయ స్థాయిలో వైద్య సదుపాయాలు కలిగిన చిన్నపిల్లల హాస్పిటల్‌గా నేషనల్ బోర్డ్ ఆఫ్ ఎగ్జామినేషన్, న్యూఢిల్లీ డిఎన్‌బి వారు గుర్తించి అవార్డు ఇవ్వడం సంతోషదాయకమన్నారు.

# చెడుపై మంచిని గెలిపించే అవకాశమిదే!

## ప్రచారాన్ని ప్రారంభించిన ఆదాల

ప్రస్తుత ఎన్నికల వాతావరణంలో నెల్లూరురూరల్ నియోజకవర్గంలో మంచికి, చెడుకు మధ్య యుద్ధం జరుగుతోందని, ఇందులో మంచిని గెలిపించే సదావకాశం ప్రజలకు తన రూపంలో వచ్చిందని నెల్లూరురూరల్ తెలుగుదేశం అభ్యర్థి ఆదాల ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. ఫిబ్రవరి 24న నియోజకవర్గానికి ఈశాన్యం మరియు కార్పొరేషన్ డివిజన్‌లలో వరుస క్రమంలో ఒకటో డివిజన్ అయిన కోడూరుపాడు గ్రామం నుండి ఆయన ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. దానికి ముందు స్థానిక శివాలయంలో పూజలు నిర్వహించారు. అనంతరం ఇక్కడ ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో చంద్రబాబు అధికారం చేపట్టే నాటికి ఆర్థిక పరిస్థితి దారుణంగా ఉండిందని, అయినా ఆయన కాబట్టి లోటుపాట్లు తెలియకుండా నెట్టుకొచ్చాడని చెప్పారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితితో సంబంధం లేకుండా రాష్ట్ర వ్యాప్తంగా ఇన్ని సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయంటే అది కేవలం చంద్రబాబు నాయకత్వ సామర్థ్యం వల్లేనన్నారు. ప్రతి ఇంటికి గ్యాస్, మరుగుదొడ్లు, పింఛన్లు, పసుపు-కుంకుమ, రైతుభరోసా వంటివన్నీ ఆయన పుణ్యమేనన్నారు. కోడూరుపాడుకు హైవే నుండి ప్రత్యేక రోడ్డు వేశామని, రెండువేల మందికి ఇళ్ల స్థలాలు ఇచ్చామని చెప్పారు. స్థానిక ఎమ్మెల్యే మూడేళ్ళు అసెంబ్లీకి పోలేదని, ఆయన సొంత పనులు, పంచాయితీలు చేసుకుంటున్నాడని ఆరోపించారు. అలాంటి వాళ్లను ఎన్నుకుంటే ప్రమాదాలను కొనితెచ్చుకోవడమేనని ఆయన పేర్కొన్నారు. అభివృద్ధి చేసేవాళ్ళు కావాలో, పంచాయితీలు చేసేవాళ్ళు కావాలో మీరే నిర్ణయించుకోవాలని ఆదాల చెప్పారు. ఈ సందర్భంగా ఆదాల ప్రచారాన్ని మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి తన చేతుల మీదుగా ప్రారంభించారు.

ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా అధ్యక్షులు బీద రవిచంద్ర, స్థానిక టిడిపి నాయకులు కోడూరు కమలాకర్‌రెడ్డి, మాజీఎమ్మెల్యే కంభం విజయరామిరెడ్డి, మేయర్ అబ్దుల్ అజీజ్, టిడిపి నాయకులు హరిబాబు, ఖాజావలి, స్వర్ణ వెంకయ్య, జె.రమణయ్య, పి.కోటేశ్వరరెడ్డి, మాగుంట శరత్‌చంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



వృద్ధురాలిని ఆప్యాయంగా సత్కరిస్తున్న ఆదాల ప్రభాకర్‌రెడ్డి

# మార్చి 3న 'సేవా ధార్మిక్' అవార్డులు

- విశిష్ట సేవాసంస్థలకు ప్రతిష్టాత్మక పురస్కారాలు
- అవార్డుకు ఎంపికైన నెల్లూరు 'జనహిత'

హైదరాబాద్‌లోని లతా రాజా ఫౌండేషన్‌వారి ఆధ్వర్యంలో మార్చి 3వ తేదీన జాతీయస్థాయిలో విశిష్టమైన సేవలందిస్తున్న పలు స్వచ్ఛంధ సేవాసంస్థలకు ఎంతో ప్రతిష్ఠాత్మకమైన 'సేవా ధార్మిక్ అవార్డులు' ప్రదానం చేయనున్నారు. సేవారంగంలో నిరుపమానమైన సేవలందిస్తున్న సంస్థలకు ఇచ్చే ఈ అవార్డుల స్వీకర్తల్లో నెల్లూరుకు చెందిన ప్రముఖ సేవాసంస్థ 'జనహిత' వాత్సల్య సంస్థ కూడా ఉండడం విశేషం. నెల్లూరులోని శ్రీ వేంకటేశ్వర కస్తూర్బా కళాక్షేత్రంలో ఆరోజు సాయంత్రం 6 గంటల నుంచి ప్రారంభమయ్యే ఈ కార్యక్రమంలో ఎందరో సేవామూర్తులు, సేవాసంస్థల ప్రతినిధులు కూడా పాల్గొననున్నారు. ఈ కార్యక్రమానికి రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, ఏపిఎస్‌సి ఫైనాన్స్ కార్పొరేషన్ ఛైర్మెన్ జూపూడి ప్రభాకర్‌రావు, శాంతా బయోటెక్నిక్స్ ఛైర్మెన్ డా. వరప్రసాదరెడ్డి, జిల్లా కలెక్టర్ ఆర్.ముత్యాలరాజు, అటవీశాఖ అడిషనల్ ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ జెఎస్ఎన్ రావ్, బిఎస్ గ్రూప్ కంపెనీల వ్యవస్థాపకుడు బందారి శ్రీనివాస్, 'లాయర్' వారపత్రిక అధినేత తుంగా శివప్రభాత్‌రెడ్డి ముఖ్యఅతిథులుగా పాల్గొంటారు. సాక్షి ఎగ్జిక్యూటివ్ ఎడిటర్ స్వప్న వ్యాఖ్యాతగా వ్యవహరిస్తారు.

### అవార్డులు అందుకునే సేవాసంస్థలు ఇవే...

ముంబైలోని శ్రద్ధ రెహాబిలిటేషన్ ఫౌండేషన్, న్యూఢిల్లీలోని దేవ్ ఎనిమల్ వాలెంటరీ ఆర్గనైజేషన్ (డిఏవిఒ), నెల్లూరులో ఉన్న జనహిత స్వచ్ఛంధ సేవా సంస్థ, పశ్చిమ బెంగాల్‌లోని ముర్షీదాబాద్‌లో ఉన్న ఆనంద శిక్షా నికేతన్ సేవాసంస్థలకు ఈ అవార్డులు ప్రదానం చేయ నున్నారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌కు చెందిన ఎండి.షకీర్ సూపర్ మెమొరీషోతో పాటు, వైష్ణవి యజ్జేష్ బృందం (హైదరాబాద్) వారి నృత్యప్రదర్శనలు అందరినీ అలరించనున్నాయి.






# నరసింహా... దీవించు

## వేదగిరి సన్నిధిలో ఆదాల...



వేదపండితుల ఆశీర్వచనాలందుకుంటున్న ఆదాల ప్రభాకర్‌రెడ్డి

మాజీమంత్రి, నెల్లూరు రూరల్ అసెంబ్లీ నియోజకవర్గ తెలుగుదేశం అభ్యర్థి ఆదాల ప్రభాకర్‌రెడ్డి ప్రచారానికి ముందురోజు ఫిబ్రవరి 23వ తేదీన నరసింహపురంలోని శ్రీ వేదగిరి లక్ష్మీనరసింహస్వామి ఆలయాన్ని దర్శించుకున్నారు. ఆలయ ఛైర్మెన్ మలినేని వెంకటేశ్వర్లునాయుడు, ఇ.ఓ ఏ.వి.శ్రీనివాసులురెడ్డి ఆలయ మర్యాదలతో ఆయనకు స్వాగతం పలికారు. స్వామి అమ్మవార్లను దర్శించుకుని ఆయన పూజలు నిర్వహించారు.


# గూడూరుకు వరప్రసాద్?



జిల్లాలో వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీ అత్యంత బలంగా వున్న నియోజకవర్గాలలో ఇప్పుడు గూడూరు అసెంబ్లీ మొదటి స్థానంలో వుంది. ఈ నియోజకవర్గంలో పార్టీకి బలమైన నాయకత్వముంది. ఓ పక్క నల్లపరెడ్లు, ఇంకో పక్క నేదురుమల్లి కుటుంబం, పేర్నాటి, పొణకా, వేమారెడ్డి వంటి రాజకీయ కుటుంబాలు వైసిపిలోనే వున్నాయి. పార్టీ బలంగా వున్నచోట అభ్యర్థి కూడా ఇంకా బలమైనోడైతే... గూడూరులో అదే జరగబోతుంది.

గూడూరు అసెంబ్లీకి వైసిపి అభ్యర్థిగా తిరుపతి మాజీ పార్లమెంటు సభ్యులు వెలగపూడి వరప్రసాద్ దాదాపు ఖరారైనట్లు తెలుస్తోంది. 2009లో ప్రజారాజ్యం పార్టీ నుండి తిరుపతి లోక్‌సభకు పోటీ చేసి ఓడిపోయిన వరప్రసాద్, 2014 ఎన్నికల్లో అదే నియోజకవర్గం నుండి వైసిపి అభ్యర్థిగా విజయం సాధించాడు. ఎంపీగా ఈ ఐదేళ్ళు బాగా పనిచేశాడు. ప్రజలకు అందుబాటులో వున్నాడు. ప్రత్యేకహోదా ఆందోళనల్లో చురుకుగా పాల్గొన్నాడు. ఆయన మీద వ్యతిరేకత లేదు. మనిషి కూడా అందరితో కలిసిపోయే గుణమున్నోడు. గూడూరు అసెంబ్లీ అభ్యర్థి అయితే వర్గాలు, గ్రూపులు లేకుండా అందరూ పనిచేస్తారు కూడా!

తిరుపతి లోక్‌సభ వైసిపి అభ్యర్థిగా స్వచ్ఛంధ పదవీ విరమణ తీసుకున్న ఓ ఐఏఎస్ అధికారి రాబోతున్నట్లు సమాచారం.




## కళ్యాణ వైభవం...!

### హరీష్ - నిమిష



వింజమూరు మండల వైసిపి కన్వీనర్ గువ్వల కృష్ణారెడ్డి - విజయమ్మల కుమారుడు **హరీష్ - డాక్టర్ నిమిషారెడ్డి** (తమిళనాడు రాష్ట్రం తిరుచ్చి వాస్తవ్యులు డా॥ ఎస్.వెల్‌చామిరెడ్డి - శాంతి వెల్‌చామిల కుమార్తె)ల పెళ్ళి ఫిబ్రవరి 21వ తేదీ చెన్నైలోని పామ్‌గ్రో హోటల్ నందు జరిగింది. నూతన దంపతులకు 'లాయర్' శుభదీవెనలు.

### శ్రీనివాస్ - అనూష



ప్రముఖ రియల్‌ఎస్టేట్ వ్యాపారి తుమ్మల విలాస్‌రెడ్డి - సుమనల కుమారుడు **శ్రీనివాస్‌రెడ్డి - అనుషారెడ్డి** (కర్నూలు వాస్తవ్యులు బైరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి - శ్రీలతల కుమార్తె)ల కళ్యాణం ఫిబ్రవరి 22వ తేదీ కర్నూలులోని కర్నూలు కన్వెన్షన్ సెంటర్ నందు జరిగింది. వధూవరులకు 'లాయర్' శుభాకాంక్షలు.

### స్పందన - గౌతమ్



స్పందన యాడ్స్ అధినేత కనమర్లపూడి శివరామప్రసాద్ - శైలజల కుమార్తె **స్పందన - గౌతమ్** (బెంగుళూరు వాస్తవ్యులు కొండపనేని సాంబశివరావు - లలితకుమారిల కుమారుడు)ల వివాహం ఫిబ్రవరి 24వ తేదీ నెల్లూరులోని సిపిఆర్ కళ్యాణ మండపం నందు జరిగింది. నవదంపతులకు 'లాయర్' శుభాశీస్సులు.

### హేమసాయిశ్రీ - నాగరాజు



హరివిల్లు క్రియేషన్స్ అధినేత దోర్నాల హరిబాబు - శివపార్వతిల కుమార్తె **హేమసాయిశ్రీ - నాగరాజు** (ప్రకాశం జిల్లా జరుగుమల్లి గ్రామ వాస్తవ్యులు బోయిళ్ళపల్లి సుబ్బారావు - గోవిందమ్మల కుమారుడు)ల పెళ్లి ఫిబ్రవరి 24వ తేదీ టంగుటూరులోని కామాని రామయ్య శేషారత్నం కన్వెన్షన్ హాలు నందు జరిగింది. కొత్త జంటకు 'లాయర్' శుభాభినందనలు.

# ఉదయగిరికి దశ తిరిగింది

## వింజమూరులో నీళ్ళ పథకాలకు శంకుస్థాపనలు చేసిన మంత్రులు



వింజమూరులో సాగు, తాగునీటి పథకాలకు శంకుస్థాపనలు చేస్తున్న మంత్రులు

నెల్లూరుజిల్లా ఉదయగిరి నియోజకవర్గ పరిధిలో రూ.1161 కోట్ల పనులకు శంకుస్థాపన చేయడం తెలుగుదేశం ప్రభుత్వ విజయమని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి పేర్కొన్నారు. గత నెల 24న వింజమూరు చెరువుకట్ట వద్ద రూ.468 కోట్లతో చేపట్టే ఇంటింటికి కుళాయి ద్వారా తాగునీరు అందించే జలధార పథకం, రూ.601కోట్లతో సోమశిల హైలెవల్ కెనాల్ రెండవ దశ పనులకు, రూ.91.26కోట్లతో లింక్ రోడ్ల పనులకు మంత్రి నారాయణతో కలిసి ఆయన శంకుస్థాపనలు చేశారు. అనంతరం ప్రధాన రహదారిలో బంగ్లా కూడలి నుంచి పంచాయితీ బస్టాండ్ వరకు ర్యాలీగా వచ్చారు. ఇక్కడ ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ సోమశిల హైలెవల్ కాలువ రెండో దశ వలన ఉదయగిరి నియోజకవర్గంలో 47వేల ఎకరాలు సాగులోకి వస్తాయన్నారు.

రాష్ట్ర మున్సిపల్ శాఖామంత్రి పొంగూరు నారాయణ మాట్లాడుతూ కేంద్రం, రాష్ట్రానికి చేసిన అన్యాయానికి వ్యతిరేకంగా చంద్రబాబునాయుడు ధర్మపోరాటం చేస్తున్నారని, మహిళలకు చేయూతనిచ్చేందుకు సంచలనాత్మక నిర్ణయాలు తీసుకుని వారికి వెన్నుదన్నుగా నిలిచారన్నారు. రాష్ట్ర తెలుగురైతు అధ్యక్షుడు కంభం విజయరామిరెడ్డి, జడ్పీటీసీ పి.వి.నారాయణరెడ్డి, టిడిపి నాయకులు తిప్పిరెడ్డి నారపరెడ్డి, దంతులూరు వెంకటేశ్వరరావు, గాలి నరసపనాయుడు, గొంగటి రఘునాథరెడ్డి, గణపం సుదర్శన్‌రెడ్డి యన్నం రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్న ఈ కార్యక్రమం ఉదయగిరి ఎమ్మెల్యే బొల్లినేని రామారావు అధ్యక్షతన జరిగింది.

### రామ్‌కుమార్ ఆధ్వర్యంలో...

# వైయస్సార్సీపీలో భారీగా చేరికలు




సభలో మాట్లాడుతున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి తండ్రి రాజకీయ వారసత్వాన్ని పుణికి పుచ్చుకుని సీటు, టిక్కెట్టు అనకుండా... వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధిష్టానం తనపై పెట్టిన బాధ్యతను సమర్థవంతంగా నిర్వహిస్తున్నాడు. తిరుపతి, బాపట్ల పార్లమెంట్ నియోజకవర్గాల ఇన్‌ఛార్జ్‌గా భారీస్థాయిలో ఓటర్లను పార్టీలో చేర్చడంలో కీలకపాత్ర పోషిస్తున్నాడు. అందులో భాగంగా నెల్లూరుజిల్లా వాకాడులో గత నెల 24న నిర్వహించిన ఆత్మీయ కలయిక, ఆనంద చేరిక కార్యక్రమంలో చిట్టమూరు, వాకాడు, కోట మండలా ల్లోని నేదురుమల్లి అభిమానులను రామ్‌కుమార్‌రెడ్డి పార్టీలోకి ఆహ్వానించాడు. చిట్టమూరు మండలం గునుపాటిపాళెం గ్రామానికి చెందిన నాయకుడు దువ్వూరు మధుసూదనరెడ్డితో పాటు వివిధ పార్టీలకు చెందిన సుమారు 800కుటుంబాలు రామ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో వైయస్సార్సీపీలో చేరాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని నేదురుమల్లి అభిమానులను ఒక్క తాటిపైకి తెచ్చి రానున్న రోజుల్లో వైయస్సార్సీపీ కోసం పనిచేసేందుకు ప్రణాళిక ప్రకారం ముందుకెళ్తామన్నారు. వైయస్ జగన్ ఆదేశాల మేరకు ఒక నియోజకవర్గం, ఒక జిల్లాయే కాకుండా రాష్ట్రంలోని నేదురుమల్లి అభిమానులను కలిసి వారందరిని వైయస్సార్సీపీలోకి ఆహ్వానిస్తున్నానని అన్నాడు. ఇదంతా జగన్మోహన్‌రెడ్డిని సీఎంగా చేసేందుకేనని చెప్పారు. కార్యక్రమంలో సూళ్ళూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య, గూడూరు నియోజకవర్గ సమన్వయకర్త మేరిగ మురళీధర్, సిఇసి సభ్యులు ఎల్లసిరి గోపాల్‌రెడ్డి, కొడవలూరు ధనుంజయరెడ్డి, నాశిన నాగులు, కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# బిజిఆర్ డిగ్రీ కళాశాల వార్షికోత్సవ వేడుకలు




సాంస్కృతిక కార్యక్రమాల్లో విద్యార్థినులు

నెల్లూరులోని డా. బెజవాడ గోపాలరెడ్డి మహిళా డిగ్రీ కళాశాలలో గతనెల 23న వార్షికోత్సవ వేడుకలు జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన విక్రమసింహపురి యూనివర్శిటీ కాలేజ్ ప్రొఫెసర్ డా.సుజా యస్.నాయర్ మాట్లాడుతూ విద్యార్థినులు బాగా చదువుకుని ఉన్నతస్థాయిలో రాణించాలన్నారు. కళాశాల సెక్రటరీ మరియు కరెస్పాండెంట్ జెవి రెడ్డి మాట్లాడుతూ తమ కళాశాలలో విలువలతో కూడిన విద్యనందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ శ్రీమతి మృదుల, ఏ.ఓ నరేష్, సీనియర్ అధ్యాపకులు తదితరులు పాల్గొని వివిధ పోటీల్లో విజేతలైన విద్యార్థినులకు బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం విద్యార్థినులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి.

# రాష్ట్రంలో టిడిపి మసకబారుతోంది

## - మాజీమంత్రి ఆనం రామనారాయణరెడ్డి



ఆనం, కాకాణిల సమక్షంలో వైసిపిలో చేరిన రావుల దశయ్యగౌడ్, బచ్చల సురేష్‌కుమార్‌రెడ్డి తదితరులు

రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ రోజు రోజుకు మసకబారుతోందని మాజీమంత్రి, వైయస్సార్సీపీ వెంకటగిరి సమన్వయకర్త ఆనం రామనారాయణరెడ్డి పేర్కొన్నారు. గత నెల 23న నెల్లూరు జిల్లా పొదలకూరు మండలంలోని బలహీనవర్గాల నాయకుడు రావుల దశరథరామయ్య గౌడ్, విరువూరు, మరుపూరు, ఆర్‌వైపాళెం మాజీసర్పంచ్‌లు బచ్చల సురేష్‌కుమార్‌రెడ్డి, వళ్ళూరు గోపాల్‌రెడ్డి, చిట్టెంశెట్టి వెంకటేశ్వర్లు టిడిపి నుండి వైయస్సార్సీపీలో చేరిన సందర్భంగా పట్టణంలోని పంచాయితీ బస్టాండ్‌లో బహిరంగ సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆనం రామనారాయణరెడ్డి మాట్లాడుతూ ప్రత్యేకహోదా అంశాన్ని చట్టంలో చేర్చలేదని, ప్రస్తుతం రాహుల్ గాంధీ ప్రత్యేకహోదా ఇస్తామని తిరుపతిలో చెప్పడం విడ్డూరంగా వుందన్నారు. చంద్రబాబు జాతీయపార్టీలైన కాంగ్రెస్‌తో జాతీయ స్థాయిలో పొత్తుపెట్టుకున్నారని, బీజేపీతో రహస్య ఒప్పందం కుదుర్చుకున్నాడని ఆరోపించాడు. సర్వేపల్లి నియోజకవర్గంలో అభివృద్ధి మాటున అవినీతి జరుగుతున్నట్లు సర్వేపల్లి ఎమ్మెల్యే కాకాణి గోవర్ధన్‌రెడ్డి విమర్శించారు. అవినీతికి పాల్పడలేదని మంత్రి సోమిరెడ్డి కాణిపాకంలో ప్రమాణం చేస్తే తాను 2019 ఎన్నికల్లో పోటీ చేయనన్నారు. తిరుపతి మాజీ ఎంపి వి.వరప్రసాద్‌రావు, రావుల దశయ్యగౌడ్, బచ్చల సురేష్‌కుమార్‌రెడ్డి, గోగిరెడ్డి గోపాల్‌రెడ్డి, వేమారెడ్డి శ్యాంసుందర్‌రెడ్డి, మేరుగ గణేష్ పాల్గొన్నారు.

## ప్రజా నాయకులు టిడిపిలోకి...

# అవినీతిపరులు వైసిపిలోకి!

## - మంత్రి సోమిరెడ్డి



సోమిరెడ్డి సమక్షంలో టిడిపిలో చేరిన మహిళలు


ప్రజల్లో బలం వున్న నాయకులు తెలుగుదేశంలో చేరుతుంటే, తమ అవినీతి చేష్టలతో ప్రజల్లో విశ్వాసం కోల్పోయిన నాయకులు వైసిపిలో చేరుతున్నారని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి చెప్పారు. ఫిబ్రవరి 24వ తేదీన మనుబోలులో రావుల అంకయ్య గౌడ్, సుబ్రహ్మణ్యం, కె.శ్రీనివాసులు, జితేంద్ర, నాగభూషణం, వేణుంబాక కోటేశ్వరరావు, శైలజ తదితరుల ఆధ్వర్యంలో 170కుటుంబాల వారు తెలుగుదేశంలో చేరారు. మంత్రి సోమిరెడ్డి వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా సోమిరెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్యేలుగా, మంత్రులుగా, జడ్పీ ఛైర్మెన్‌లుగా, సమితి ప్రెసిడెంట్లుగా పొదలకూరు మండలాన్ని పాలించినవారు ఈ మండలం అభివృద్ధి కోసం ఏం చేశారో చెప్పాలంటూ కాకాణి, ఆనం కుటుంబాలను దృష్టిలో పెట్టుకుని ప్రశ్నించారు. సోమశిల దక్షిణ కాలువ పనులను సాధించడానికి, కండలేరు ఎత్తిపోతల పథకాన్ని అందుబాటులోకి తేవడానికి మీకు పదేళ్లు సరిపోలేదా? అని నిలదీశారు. ముఖ్యమైన ప్రాజెక్టులన్నింటిని మీరు గాలికొదిలేస్తే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సహకారంతో వాటన్నింటిని తాము పూర్తి చేశామన్నారు. ఈరోజు ప్రతి గ్రామం, ప్రతి కాలనీలో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని, ప్రజల ముందుకు ధైర్యంగా వెళ్లి ఓటడిగే అవకాశాన్ని చంద్రబాబు తమకు కల్పించారని ఆయన పేర్కొన్నారు. మనుబోలు మండల ప్రజలు తనకు భారీమెజార్టీ ఇవ్వబోతున్నారని ఆశాభావం వ్యక్తం చేశారు.

# శ్రీసిటీలో భద్రతా వారోత్సవాలు




భద్రతా ప్రతిజ్ఞ చేస్తున్న శ్రీసిటీ సిబ్బంది

శ్రీసిటీలో 48వ జాతీయ భద్రతా వారోత్సవాలు గతనెల 25న ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా శ్రీసిటీలోని కస్టమ్స్ పాయింట్ వద్ద శ్రీసిటీ ప్రెసిడెంట్ (ఆపరేషన్స్) సతీష్‌కామత్ జెండా ఊపి ఈ వారోత్సవాలను ప్రారంభించారు. శ్రీసిటీ సిబ్బంది మరియు స్థానికులతో భద్రతా ప్రతిజ్ఞ చేయించారు. ఇలాంటి కార్యక్రమాల ద్వారా భద్రతా అంశాలపై అవగాహన పెరగడంతో పాటు ఈ ప్రాంతం ప్రమాద రహిత జోన్‌గా మారుతుందని ఈ సందర్భంగా శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ రవీంద్ర సన్నారెడ్డి ఒక ప్రకటనలో ఆశాభావం వ్యక్తం చేశారు. భద్రతా వారోత్సవాలపై అవగాహన కల్పించేందుకు వారంరోజులు శ్రీసిటీ ఉద్యోగులతోపాటు, విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వం, డ్రాయింగ్ పోటీలు నిర్వహించనున్నట్లు శ్రీసిటీ మేనేజర్(సేఫ్టీ) నరేంద్రబాబు తెలిపారు.





# శతమానం భవతి!

## అలుపెరుగని సేవామూర్తి.. డాక్టర్ సిఆర్‌రెడ్డి

*భగవంతుని సృష్టిలో మానవజన్మ అత్యుత్తమమైనది. అయితే, ఆ జన్మను సార్థకం చేసుకోగలగడమన్నది ఏ కొద్దిమందికి మాత్రమే సాధ్యమవుతుంది. అలాంటి అరుదైన వ్యక్తిత్వం..మానవత్వం మూర్తీభవించిన వ్యక్తి డా. సిఆర్ రెడ్డి. చిన్నతనం నుంచి పట్టుదలతో..నిరంతర కృషితో విద్యలో రాణించి.. ప్రతిభాపాటవాలతో వైద్యరంగంలో సుస్థిరస్థానం సాధించి..ప్రజావైద్యునిగా జిల్లాస్థాయిలోనే కాక రాష్ట్రస్థాయిలోనూ ఎనలేని ఖ్యాతిని సముపార్జించి..అటు వైద్యరంగంలోనూ..ఇటు విద్యారంగంలోనూ నేటికీ సమాజానికి నిరుపమానమైన సేవలందిస్తూ అందరి ప్రశంసలు అందుకుంటున్న వైద్యసేవారత్నం..డాక్టర్ సి.ఆర్.రెడ్డి. ఒక్కమాటలో చెప్పాలంటే సింహపురి సీమకే గర్వకారణమైన ప్రజావైద్యులాయన. 90 ఏళ్ళు వచ్చినా ఎంతో ఉత్సాహంతో ప్రజా సంక్షేమం కోసం నేటికీ తనవంతు సేవలు అందిస్తూనే ఉండడం ఇంకా విశేషం. వారి సేవలు ఈ తరానికే కాదు.. భావితరాలకు కూడా స్ఫూర్తిదాయకమని వేరే చెప్పనక్కరలేదు. ఆ అవిశ్రాంత యోధునికి.. అలుపెరుగని సేవామూర్తికి..'లాయర్' జన్మదిన శుభాకాంక్షలు!..*

డాక్టర్ సిఆర్‌రెడ్డి అంటే గూడూరులోనే కాదు, జిల్లాలోనూ..రాష్ట్రవ్యాప్తంగానూ బాగా సుపరిచితమే. నెల్లూరుజిల్లాలోని పెనుబల్లి గ్రామంలో సామాన్య రైతు కుటుంబంలో జన్మించారాయన. తల్లిదండ్రులు చిల్లకూరు వెంకురెడ్డి-శేషమ్మగార్లకు ఆయన మూడవ సంతానం. 1.3.1929లో సిఆర్‌రెడ్డి జన్మించారు. పూర్తిపేరు..చిల్లకూరు రాధాకృష్ణారెడ్డి. పెనుబల్లిలో ప్రాథమిక విద్యాభ్యాసం పూర్తిచేసుకుని, గూడూరులో హైస్కూలు విద్య, నెల్లూరులో కళాశాల విద్య, మద్రాసు స్టాన్లీ మెడికల్ కాలేజీలో వైద్యవిద్య పూర్తి చేశారు. అత్యంత నిరాడంబరత్వం..మంచి మనస్తత్వం ఆయన సొంతం. సహజంగానే సహృదయుడు..అందరికీ స్నేహపాత్రుడు కూడా. చిన్నతనం నుంచి ప్రజాసేవాభిలాష మెండుగా ఉండేది. ఆ సేవాభావమే ఆ తర్వాత ఆసుపత్రి స్థాపనకు శ్రీకారం చుట్టింది. వైద్యవిద్య పూర్తయ్యాక ప్రప్రథమంగా తలుపూరులో వైద్యసేవలందించారు. ఆ తర్వాత నెల్లూరుకు వచ్చి డాక్టర్ పుచ్చలపల్లి రామచంద్రారెడ్డి శిక్షణలో మంచి వైద్యునిగా రాణించారు. క్రమశిక్షణతో.. సేవాతత్పరతతో జీవిస్తూ 1956లో కోట గ్రామంలో తొలిసారిగా ప్రభుత్వ వైద్యునిగా వైద్య వృత్తిని ప్రారంభించిన డాక్టర్ సిఆర్‌రెడ్డి, గ్రామాలకు వాహనాల సౌకర్యాలు లేని ఆ రోజుల్లో అర్ధరాత్రి అపరాత్రి అని లేకుండా ప్రజలకు వైద్యసేవలందించేందుకు ఎడ్లబండిపై వెళ్ళేవారు. అనేక గ్రామాలకు మైళ్ళదూరం నడచివెళ్లి వైద్యం అందిస్తూ ప్రజావైద్యునిగా ప్రజల్లో మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. ఆ తర్వాత తాళ్ళూరు, ఇసకపాళెం, కలిచేడు, విడవలూరుల్లో ప్రభుత్వ వైద్యునిగా ఉంటూ, కష్టపడి పనిచేస్తూనే గుంటూరులో ఎంఎస్ పూర్తిచేశారు. అనంతరం తిరుపతి ఎస్వీ మెడికల్ కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహించారు.

### గూడూరులో వైద్యశాల ప్రారంభం


తాను హైస్కూలులో చదువుకున్న రోజులను గుర్తుచేసుకుంటూ తనకెంతో ఇష్టమైన గూడూరులోనే స్థిరపడాలనుకుని 1966లో సొంతంగా వైద్యశాల ఏర్పాటుచేశారు. గూడూరు సిఆర్‌రెడ్డి హాస్పిటల్ అంటే ఎంతో సుప్రసిద్ధమైన ఆసుపత్రిగా, ప్రజలకు ఎంతగానో వైద్యసేవలందిస్తున్న ప్రజావైద్యశాలగా ప్రసిద్ధిచెందే విధంగా ఆ ఆసుపత్రిని తీర్చిదిద్దారు. గూడూరులో డా.సిఆర్‌రెడ్డి వైద్యసేవలు ప్రారంభించి ఇప్పటికి అర్ధశతాబ్దం పైగానే అయింది..దాదాపు యాభై ఏళ్ళకు పైగా ఆయన ప్రజలకు సాటిలేని వైద్యసేవలు అందించారంటే అతిశయోక్తి కాదు.

### ఒకే కుటుంబంలో 35మంది డాక్టర్లు

ఇక్కడొక ముఖ్యమైన విషయం ఏమిటంటే, సిఆర్‌రెడ్డి తండ్రిగారైన చిల్లకూరు వెంకురెడ్డి దంపతుల తొమ్మిది మంది సంతానంలో నలుగురు ప్రసిద్ధ డాక్టర్లున్నారు. 91ఏళ్ళ వయసులో ఉన్నా నేటికీ కావలిలో పేదవారికి వైద్యసేవలందిస్తున్న లక్ష్మీనరసారెడ్డి, పేదల పెన్నిధిగా పేరుపొందిన డాక్టర్ మోహన్‌రెడ్డి, మద్రాసులో తెలుగువారి ఆశాకిరణం.. ప్రఖ్యాత వైద్యులు డాక్టర్ సిఎంకె రెడ్డి, గూడూరులో డాక్టర్ సిఆర్‌రెడ్డి. వీరితో పాటు వివిధ ప్రాంతాల్లో సేవలందిస్తున్న డాక్టర్ రోహిణి, డాక్టర్ రాజశేఖర్‌రెడ్డి, డాక్టర్ ప్రవీణ, డాక్టర్ కిషోర్, డాక్టర్ రామ్‌కిరణ్, డాక్టర్ చరిత్, డాక్టర్ అభినవ, డాక్టర్ గాయత్రి, డాక్టర్ ప్రశాంత్, డాక్టర్ భారతి, డాక్టర్ సునంద, డాక్టర్ ప్రశాంతి, డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డిలు వారి బాటలోనే నడుస్తూ వైద్యసేవారంగంలో ప్రఖ్యాతిగాంచారు. మొత్తంగా వీరి కుటుంబంలో 35 మంది వైద్యులు దేశ విదేశాల్లో వైద్యవృత్తిలో ఉంటూ ప్రజలకు తమవంతు సేవలందిస్తుండడం విశేషం.

### తల్లిదండ్రుల పేరు సార్థకం చేశారు

జన్మనిచ్చిన తల్లిదండ్రుల పేర్లను సార్థకం చేస్తూ డాక్టర్ సిఆర్‌రెడ్డి తాను ఎక్కడ పనిచేస్తున్నా ఆ ఊళ్ళో ఒక హైస్కూలో, ఆసుపత్రో ఏర్పాటుచేయించేవారు. కోట, రాపూరు, విడవలూరు, మనుబోలు, బద్వేలు వెంకన్నపాళెంలలో కళాశాలలు ఏర్పడ్డాయంటే అదంతా డాక్టర్ సిఆర్‌రెడ్డి చొరవ, కృషి వల్లనే. అంతేకాదు, తల్లిగారైన చిల్లకూరు శేషమ్మ పేరుతో గూడూరులో మునిసిపల్ హైస్కూలు ఏర్పాటుచేశారు. మహిళా విద్యను ప్రోత్సహిస్తూ 1981లో తన ఆప్తమిత్రుడైన స్వర్గీయ అల్లారెడ్డి శ్యామసుందరరెడ్డి సహకారంతో వారి అత్తగారి జ్ఞాపకార్థం దువ్వూరు రమణమ్మ పేరుతో గూడూరులో మహిళా కళాశాల ఏర్పాటుచేశారు. అప్పట్లో 50 మందితో ప్రారంభమైన ఈ కాలేజీలో ఇప్పుడు సుమారు 2వేల మంది విద్యార్థినులు విద్యనభ్యసిస్తున్నారంటే డాక్టర్ సిఆర్‌రెడ్డి కృషి ఎంత గొప్పదో అర్థమవుతుంది. అంతేకాదు గూడూరు సమీపంలోని పూలతోట గిరిజన కాలనీలో ఉన్న సరస్వతి శిశుమందిరాన్ని దత్తత తీసుకుని నిరుపేద ఎస్‌సి, ఎస్టీ పిల్లలకు విద్యనందించడం కోసం తానే స్వయంగా 40 లక్షల రూపాయల దాకా వెచ్చించి భవన సముదాయం నిర్మాణంతో పాటు విద్యార్థులకు బస్సువసతి, మంచినీటి వసతి తదితర సౌకర్యాలన్నీ కల్పించారు. వారి దాతృత్వంతో ఆ విద్యాలయం సరస్వతీనిలయంగా కళకళలాడుతోంది. ఇంకా, లయన్స్ క్లబ్ సభ్యునిగా, రోటరీ గౌరవసభ్యులుగా ఉంటూ లక్షలాది రూపాయలను సమాజ సేవకు విరాళాలుగా అందిస్తూ డాక్టర్ సిఆర్‌రెడ్డి సమాజానికి తన వంతు సేవలందిస్తూనే ఉన్నారు. వారి సమాజసేవానిరతి నిరుపమానం.



సుమారు 3 దశాబ్దాల క్రితం తమ తండ్రి వెంకురెడ్డికి జరిపిన సహస్ర చంద్రదర్శన మహోత్సవం సందర్భంగా వెంకురెడ్డి - శేషమ్మలతో వారి సంతానం శ్రీమతి కౌసల్యమ్మ(లేట్), డా. సి.ఎల్.ఎన్.రెడ్డి, డా. సి.ఆర్.రెడ్డి, డా. సి.యం.కె.రెడ్డి, డా. మోహన్‌రెడ్డి, బాబురెడ్డి(లేట్), అనసూయమ్మ, దయాకర్‌రెడ్డి(లేట్)

### ఆదర్శప్రాయులు.. డాక్టర్ సిఆర్ రెడ్డి

కృషి ఉంటే మనుషులు రుషులవుతారన్న నానుడిని నిజం చేసి, సమాజంలో మంచి మనసుతో, సమాజసేవాభావంతో రాణిస్తూ..ఎందరి జీవితాలకో వెలుగుబాటలు పరుస్తున్న మహోన్నత వ్యక్తి..డాక్టర్ సిఆర్‌రెడ్డి నేటి తరానికే కాక, భావితరాలకు కూడా ఆదర్శప్రాయులుగా నిలుస్తున్నారు. దాదాపు 50 ఏళ్ళకు పైగానే సమాజానికి వెలలేని సేవలందిస్తున్న డాక్టర్ సిఆర్‌రెడ్డికి ఆ భగవంతుడు పరిపూర్ణమైన జీవితాన్ని, సంపూర్ణమైన ఆయురారోగ్యాలను ప్రసాదించాలని మనసారా కోరుకుంటూ..ఆయన 90వ పుట్టినరోజు సందర్భంగా 'లాయర్' శుభాకాంక్షలు!..శతమానం భవతి!....

# ఒక్క సీటు వద్దే పీకులాట!









నెల్లూరుజిల్లాలో వైసిపిలో అంతా ప్రశాంతంగానే వుంది. అధికారికంగా ప్రకటించకపోయినా అభ్యర్థులు ఎవరెవరన్నది తెలుసు. నెల్లూరు సిటి, నెల్లూరు రూరల్, సర్వేపల్లి, వెంకటగిరి, గూడూరు, కోవూరు అభ్యర్థులపై దాదాపు క్లారిటీ వుంది. సమస్య వున్నదల్లా కావలి, ఉదయగిరి, ఆత్మకూరు సీట్ల వద్దే!

నెల్లూరు పార్లమెంటు, ఆత్మకూరు, ఉదయగిరి సీట్ల విషయంలో రచ్చేంటంటే... ఈ మూడు సీట్లు మేకపాటి కుటుంబసభ్యులకు ఇవ్వాల్సి రావడమే! ఈ ముగ్గురిలో ఇద్దరికి సీట్లు ఇచ్చి, ఇంకో సీటును ఇతర నాయకులకు అడ్జస్ట్ చేసినా సమస్య లేదు. అసలు ఉదయగిరి కూడా మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డికి ఇచ్చి, మేకపాటి రాజమోహన్‌రెడ్డి, గౌతంరెడ్డిలలో ఒకరు నెల్లూరు పార్లమెంట్, లేదా ఆత్మకూరు అసెంబ్లీలలో ఒకదాని నుండి పోటీ చేస్తే మిగతాదంతా సర్దుకుంటుంది.

ఇక కావలిలో వుండే గొడవేంటంటే సిటింగ్ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్ కుమార్‌రెడ్డిని మార్చమని. మాజీఎమ్మెల్యేలు కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి, వంటేరు వేణుగోపాల్‌రెడ్డిలు దీని మీదే పట్టుబట్టారు. పార్టీ అధిష్టానం తమ మాట వినకపోయేసరికి పార్టీకి రాజీనామా చేశారు. వాళ్లిద్దరినీ తమ పార్టీలోకి రమ్మని తెలుగుదేశం నాయకులు వారి ఇళ్లకు వెళ్లి మరీ ఆహ్వానించారు. వాళ్లు ఇంకా వేచి చూసే ధోరణిలో వున్నట్లు తెలుస్తోంది. కావలి అభ్యర్థిగా ప్రతాప్‌ను మారిస్తే తమకు సీటు ఇవ్వకపోయినా, ఇంకెవరికి ఇచ్చినా పార్టీ కోసం పనిచేయడానికి సిద్ధంగా వున్నారు.

తెలుగుదేశంలోని ఓ నాయకుడు మొన్నటివరకు టిక్కెట్ ఇస్తే వైసిపిలోకి రావడానికి సిద్ధంగా వుండినాడు. ఆయనను వైసిపిలోకి తీసుకుని కావలి సీటిచ్చి వుంటే అంతా సర్దుకుని వుండేది!

### శ్రీ ప్రసన్న వేంకటేశ్వరాలయానికి
# కొత్త శోభ

నెల్లూరు రంగనాయకులపేటలోని శ్రీ తల్పగిరి రంగనాయకులస్వామి దేవస్థానం ప్రాంగణంలో కొలువైవున్న శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయం చుట్టూ అందంగా స్టీల్ గ్రిల్స్ ఏర్పాటుచేస్తూ ఆలయానికి భద్రతతో పాటు కొత్త శోభను తీసుకువస్తున్నారు ప్రముఖ దాత అచ్యుత సుబ్రహ్మణ్యం. ఆలయం అభివృద్ధి కోసం శ్రీ రంగనాథాలయ కమిటీ మాజీ ఛైర్మెన్ మంచికంటి సుధాకర్‌రావు ప్రోత్సాహంతో అచ్యుత సుబ్రహ్మణ్యం 5 లక్షల రూపాయలను వెచ్చించి ఆలయం చుట్టూతా గ్రిల్స్‌ను ఏర్పాటు చేయడం అభినందనీయం.

# దేశం కోసం తిరుమలలోనే ఉండిపోవాలనుకున్న రాహుల్

గల్పిక

ఢిల్లీలోని టెన్ జనపథ్... సోనియా గాంధీ ఒకటే టెన్షన్‌తో అటు ఇటు తిరుగుతోంది. పక్కన అహ్మద్‌పటేల్, గులాంనబీ ఆజాద్, అంబికాసోనీ, పనబాక లక్ష్మిలలోనూ టెన్షన్ కనిపిస్తోంది. వి.హెచ్ హనుమంతరావు ట్రేలో టీ కప్పులతో వచ్చి... పొద్దున నుండి వచ్చి మంచినీళ్ళు కూడా ముట్టుకోలేదమ్మ గారు మీరు... ఇలా వుంటే ఎలాగమ్మా అని అడిగాడు. రాహుల్‌బాబు కనిపించేంతవరకు మంచినీళ్ళు తాగను హనుమాన్‌జీ అని సోనియా చెప్పింది. అట్లాగయితే ఈ టీ అన్నా తాగండమ్మా అంటూ టీ కప్పు చేతికిచ్చాడు. టీకైతే ఒకే అంటూ ఆమె టీ తాగసాగింది. అప్పుడే అక్కడకు వచ్చిన మల్లిఖార్జున ఖర్గే... ఎందుకు మేడం అంత టెన్షన్‌గా వున్నారని పనబాక లక్ష్మిని అడిగాడు. దానికామె... రాహుల్‌బాబు తిరుపతికి వెళుతున్నానని చెప్పి మొన్న అనగా వెళ్లాడు. అప్పటినుండి కనిపించడం లేదు. ఎక్కడికి వెళ్లాడో, ఏమో అని మేడం దిగులు పెట్టుకుంది అని చెప్పింది. అందుకు ఖర్గే... అతనేం పసిపిల్లోడు కాదుకదా మేడం, ప్రపంచం చుట్టిన వీరుడు. రేపు భారతదేశాన్ని పాలించాల్సిన నాయకుడు. ఎక్కడకూ పోడులే అని సముదాయించాడు. దానికి అహ్మద్ పటేల్... మేడమ్ భయం అది కాదు, తిరుపతికి వెళ్లాక తిరుమలకు మెట్లెక్కి కాలినడకన పోతానని చెప్పాడట... మోకాలి పర్వతం ఎక్కేటప్పుడు ఎక్కడ మోచిప్పలు అరిగిపోతాయో... అసలే పెళ్లికానోడు అనేది మేడమ్ భయం అని చెప్పాడు. అప్పుడు ఖర్గే... మనం ఇక్కడ కూర్చుని టెన్షన్ పడడం దేనికి... ఆ తిరుపతి, తిరుమల కొండల్లోనే రాహుల్ కోసం వెదుకుతాం పదండి అని చెప్పాడు. అంతలో మధుయాష్కీ పరుగెత్తుకుంటూ వచ్చి 'ఈనాడు' పత్రిక వారి ముందు పెట్టాడు. 'కాలి నడకన తిరుమలకు రాహుల్. 'గంటా 48 నిముషాల రికార్డ్ టైంలో తిరుమలకు చేరుకున్న మొదటి వ్యక్తి'... అని న్యూస్ వుంది. ఆ వార్త చూసి సోనియా షాక్ తింది. వీడు నిజంగానే మోకాళ్లు పోగొట్టుకునేట్టున్నాడు. వీడికి ఇక పిల్లనెవరిస్తారు దేవుడా అని ఏడవసాగింది. అంబికాసోని ఆమెను ఓదారుస్తూ... ముందు రాహుల్ ఎక్కడ వున్నాడో వెదుకుతాం పదండి... అంటూ అందరినీ లేవదీసింది.

★★★★★

స్పెషల్ ఫ్లైట్‌లో సోనియా బ్యాచ్ అంతా తిరుపతి ఎయిర్‌పోర్టులో దిగారు. అక్కడనుండి కార్లలో అలిపిరి వద్దకు చేరుకున్నారు. మెట్ల మార్గంలో రాహుల్‌ను వెదుక్కుంటూ కొండెక్కసాగారు. కొండెక్కే భక్తులందరూ 'గోవింద గోవింద' అని అరుస్తుంటే సోనియా బృందం మాత్రం 'రాహుల్ రాహుల్...' అంటూ ఎక్కసాగింది. వీళ్ళ అరుపులు విని... పక్కనున్న భక్తులు ఈమధ్య వెంకటేశ్వరస్వామి పేరును 'రాహుల్' అని మార్చారా ఏంటి... మనం అది తెలుసుకోక పాత పేరుతోనే 'గోవింద' అని పిలుస్తున్నామా అని అయోమయంలో పడ్డారు. వీళ్లెవరో పెద్దమనుషులు, బాగా చదువుకున్నోళ్ల లాగుంది. ఖచ్చితంగా గోవిందుడి పేరును రాహుల్‌గా మార్చబట్టే రాహుల్... రాహుల్ అని అరుస్తున్నారు. మనం కూడా అదే పేరును స్మరిస్తే పోలేదా అనుకుంటూ వారి వెనుక ముందు వుండే భక్తులు కూడా 'రాహుల్ రాహుల్' అంటూ పిలవసాగారు. ఆ పిలుపులు విని సోనియా... రాహుల్ కోసం ఇంత మంది వెదుకుతున్నారా... అని మనసులో అనుకుంది. అలా అరుచుకుంటూ అందరూ కొండపైకి చేరుకున్నారు. అన్ని సందుల్లో, అన్ని రోడ్లలో, అన్ని హోటల్స్, అన్ని దుకాణాల వద్ద రాహుల్ కోసం వెదకసాగారు. ఎక్కడా కనిపించలేదు. అందరికీ బాగా ఆకలేస్తుండడంతో 'తరిగొండ వెంగమాంబ నిత్యాన్నదాన సత్రం'లోకి వెళ్ళారు. అందరూ ఒకే వరుసలో కూర్చున్నారు. శ్రీవారి సేవకులు అందరికీ అరిటాకులు వేసి అన్నప్రసాదం వడ్డించారు. భక్తులంతా తింటున్నారు. సేవకులు కూరలు వడ్డిస్తున్నారు. అంతలో సోనియా బృందం వెనుక బెంచీలో నుండి... బాబూ కొంచెం 'పప్పు' వడ్డించు అనే మాట వినిపించింది. ఆ గొంతు ఎక్కడో విన్నట్లుండడంతో పనబాక లక్ష్మి భోజనం దగ్గర నుండి లేచి ఆ వైపుకు వెళ్లి చూసింది. అంతే పెద్దగా... మేడమ్ మన పప్పు దొరికాడు అని నోరుజారి... సారీ, మన రాహుల్ దొరికాడు అని కేకేసింది. భోజనాలు చేస్తున్నవాళ్ళు ఒక్క ఉదుటన లేచి అక్కడికి వెళ్లారు. రాహుల్‌గాంధీ భక్తుల వరుసలో కూర్చుని శుభ్రంగా తింటున్నాడు. సోనియా వుండి... ఏంటి రాహుల్, ఒక్కరోజు పర్యటనకని ఇక్కడకు వచ్చి, ఇక్కడే వుండిపోయావని అడిగింది. దానికి రాహుల్... ఒక్కరోజు అనే వచ్చానమ్మా, కాని నాకు రోజూ ఇక్కడే వుండాలనిపిస్తోంది. ఇక్కడి వాతావరణం ఎంతో ప్రశాంతంగా వుంది. శుభ్రంగా పప్పు వేసి భోజనం పెడుతున్నారు. శ్రీవారి కీర్తనలు, భజనలతో మనసు ప్రశాంతంగా వుంది. నేను ఇక్కడే వుంటాను అని చెప్పాడు. సోనియా వుండి... అయినా గంటా యాభై నిముషాలలో కొండెలా ఎక్కావు. మోకాళ్ల పర్వతం ఎక్కినప్పుడు మోకాళ్ళు నొప్పులు రాలేదా అని అడిగింది. దానికి రాహుల్... తిరుమల ఘాట్ ప్రయాణంలో మోకాళ్ళ పర్వతం స్కిప్ చేసానమ్మా, ఆ ఒక్క చోట కారులో వెళ్లాను అని చెప్పాడు. వెరీగుడ్ రాహుల్... మన కుటుంబం పదవుల్లోకి వచ్చింది కూడా ఇలాగే అని చెప్పి... ఇక ఢిల్లీకి పోదాం పదమ్మా, అక్కడ చాలా పని వుంది అని సోనియా అంది. అందుకు రాహుల్... లేదమ్మా, నేను ఇక్కడే వుంటానమ్మా, నేను తిరుమలలో స్వామి సేవ చేస్తుంటే దేశం ప్రశాంతంగా వుంటుందని మొన్న ఇక్కడే కనిపించిన ఒక స్వామీజీ చెప్పాడు. దేశం కోసం, దేశ ప్రజల సుఖసంతోషాల కోసం నేను ఇక్కడే వుంటానమ్మా అని అన్నాడు. అందుకు సోనియా... అయ్యో పిచ్చినా తండ్రీ!... అతనెవరో బీజేపీ స్వామి అయ్యుంటాడు... బీజేపీ వాళ్లే అలా చెప్పించి వుంటారు. నువ్విక్కడే వుండిపోతే ఆ బీజేపీ వాళ్లకు అడ్డం వుండదు. మళ్లీ మోడీ పీఎం అయితే దేశం ప్రశాంతంగానే వుంటుంది. కాకపోతే మాకే మనశ్శాంతి వుండదు. దేశం సుఖం, దేశం శాంతి అనే పిచ్చి మాటలు మాని ఢిల్లీకి పోదాం పద అంటూ చేయి పట్టుకుని ఈడ్చుకుపోసాగింది.

## నమ్మిన వారిని...
# నట్టేటముంచడమే చంద్రబాబు నైజం

**- సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి**



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి

నమ్మినవారిని నట్టేట ముంచడమే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నైజమని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి వ్యాఖ్యానించారు. గత ఎన్నికల సమయంలో చంద్రబాబు 600 హామీలిచ్చి ఒక్కటి కూడా నెరవేర్చకుండా అన్నివర్గాల ప్రజల్ని మోసం చేశారన్నారు. ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు పలు సభల్లో పాల్గొని ఈ అభివృద్ధి పనులన్నీ కేంద్రం నుంచి వచ్చిన నిధులతోనేనని స్పష్టం చేశారని, దీనికి రాష్ట్ర మంత్రులు ఏం సమాధానం చెబుతారని ఆయన ప్రశ్నించారు. మార్చి 1న వైజాగ్‌లో ప్రధాని మోదీ పర్యటన ఉందని, సిపిఐ, సిపిఎం నాయకులను లోబరచుకుని ప్రధాని పర్యటనను అడ్డుకోవాలని చంద్రబాబు చేస్తున్న ప్రయత్నం దుర్మార్గపు చర్య అని మండిపడ్డారు. జరగబోయే ఎన్నికల్లో టిడిపి పతనం ఖాయమన్నారు.

# జైళ్ళశాఖ సిబ్బంది సంఘం.. కొత్త కార్యవర్గం

రాష్ట్ర జైళ్ళశాఖ మినిస్టీరియల్ సిబ్బంది అసోసియేషన్‌కు నూతన కార్యవర్గం ఎన్నికలు గతనెల 24న నెల్లూరులో జరిగాయి. అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఇ.డి రవివర్మ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో కొత్త కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అసోసియేషన్ జోన్-4 (నెల్లూరు-ప్రకాశం) అధ్యక్షునిగా నర్రా మహేష్‌కుమార్‌ని ఎన్నుకున్నారు. షేక్ ముజీబ్‌బాషా ప్రధాన కార్యదర్శిగా, పి.కామేశ్వరరావు ఆర్థిక కార్యదర్శిగా ఎన్నికయ్యారు. అదేవిధంగా అసోసియేట్ అధ్యక్షునిగా నరహరిప్రసాద్, ఉపాధ్యక్షులుగా కె.చిన్నసుబ్బయ్య, పి. ముకుంద ప్రియ, సహాయ కార్యదర్శులుగా రాజేశ్వరరావు, షేక్ షాకీరా, ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులుగా డి.సూరపరాజు, శ్రీనివాసప్రసాద్ ఎన్నికయ్యారు. ఈ సమావేశంలో అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అన్నెపు శ్రీనివాసరావు, కోశాధికారి సుబ్రహ్మణ్యం, సహాయకార్యదర్శి సుబానీబాషా తదితరులు పాల్గొన్నారు.

# ఖాళీస్థలాలు.. దోమలపుట్టలుగా మారుతున్నాయి

**- స్వచ్ఛాంధ్ర వైస్‌చైర్మెన్ వెంకటరావు ఆందోళన**



ఆదిత్యనగర్‌లోని ఖాళీ స్థలాలను పరిశీలిస్తున్న స్వచ్ఛాంధ్ర వైస్‌చైర్మెన్ వెంకటరావు

నెల్లూరు నగరం, నెల్లూరు రూరల్ పరిధిలోని అనేక ముఖ్యమైన ప్రాంతాల్లో ఉన్న అపార్ట్‌మెంట్‌ల మధ్య కోట్లాది రూపాయల విలువైన స్థలాలను ఖాళీగా వదిలేసి ఉన్నారని, వాటి ఆలనాపాలనా పట్టించుకోకపోవడంతో ఆ ఖాళీస్థలాలు దోమలకు నిలయాలుగా మారుతున్నాయని స్వచ్ఛాంధ్ర మిషన్ వైస్‌చైర్మెన్ డాక్టర్ సిఎల్ వెంకటరావు ఆందోళన వ్యక్తం చేశారు. ఈనెల 24న ఆయన నెల్లూరులోని చిల్డ్రన్స్ పార్క్ సమీపంలో ఉన్న ఆదిత్యనగర్‌లో పర్యటించి నీటిగుంతలుగా మారిపోయిన ఖాళీస్థలాలను పరిశీలించారు. ఇలా ఖాళీగా స్థలాలను వదిలేయడం వల్ల ఈ నీటిగుంతలు దోమల ఉత్పత్తికేంద్రాలుగా మారుతున్నాయని, పందులు, గేదెలకు ఆవాసంగా మారి చుట్టుపక్కల అంతా దుర్గంధభూయిష్టమైన వాతావరణం ఏర్పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. అనేక ముఖ్యమైన ప్రాంతాల్లో ఎంతో కష్టపడి అపార్ట్‌మెంట్లు కొనుగోలు చేసుకుని ఉంటారని, అయితే వాటికి దగ్గరగా ఉన్న ఇలాంటి నీటిగుంతల వల్ల అపార్ట్‌మెంట్ వాసులు ఎంతో ఇబ్బందిపడుతున్నారని అన్నారు. ఈ సమస్యను ప్రజలు మంత్రి నారాయణ దృష్టికి తీసుకురాగా, ఆ స్థలాలను శుభ్రం చేయాలని సూచించారన్నారు. కొందరు స్థలాలను కొనుగోలు చేసి విదేశాల్లో, ఇతర ప్రాంతాల్లో ఉంటున్నారని, అలాంటివారికి ఇరుగుపొరుగు వారు కానీ, వారి బంధువులు కానీ సమాచారం అందజేయాలని, స్థలాల యజమానులు కోరితే స్వచ్ఛాంధ్రమిషన్, కార్పొరేషన్ ఆధ్వర్యంలో పూర్తిగా సహకరించి ఆ స్థలాలను శుభ్రం చేయిస్తామని ఆయన వెల్లడించారు. స్థలాల యజమానులు వెంటనే స్పందించాలని, స్థలాలను శుభ్రం చేసుకునేందుకు కార్పొరేషన్ హెల్త్‌ఆఫీసర్ సుబ్బరాజును కానీ, ఫోన్ 8790995128 నెంబర్‌కు గానీ సంప్రదించి వివరాలు తెలియజేయాలని, 'స్వచ్ఛ నెల్లూరు' కోసం ప్రతి ఖాళీస్థలం యజమానులు సహకరించాలని ఆయన కోరారు.

## సిఎంఎ ఫలితాల్లో ర్యాంకు సాధించిన..
# అజిత్‌కు అభినందన



అజిత్‌ను అభినందిస్తున్న ఆచార్య ఆదిత్య

సిఎంఎ వారు ఇటీవల ప్రకటించిన సిఎంఎ ఇంటర్ ఫలితాల్లో ఆదిత్య అభ్యాస్ ప్రొఫెషనల్ అకాడమీ విద్యార్థి టి.అజిత్‌కుమార్‌రెడ్డి ఆలిండియా స్థాయిలో 47వ ర్యాంకు (534 మార్కులు) సాధించాడు. ఈ సందర్భంగా అజిత్‌ను నెల్లూరులోని ఆదిత్య కళాశాల కరెస్పాండెంట్ ఆచార్య ఆదిత్య, ప్రిన్సిపాల్ డి.పుల్లయ్య, అభ్యాస్ సిబ్బంది అభినందించారు.

# గూడూరు డివిజన్ వార్తలు

## విశ్వశాంతి స్థాపనే.. రోటరీ లక్ష్యం




మాట్లాడుతున్న కె.మునిగిరీష్, బొమ్మిరెడ్డి సురేంద్రరెడ్డి తదితరులు

ప్రపంచంలో శాంతిని నెలకొల్పాలనే లక్ష్యంతో 1905 ఫిబ్రవరి 23న అమెరికాలో అయిదుగురు సభ్యులతో ఇంటర్నేషనల్ రోటరీ క్లబ్ ఏర్పాటైందని రోటరీక్లబ్ గవర్నర్ కె.మునిగిరీష్, పూర్వ గవర్నర్ బొమ్మిరెడ్డి సురేంద్రరెడ్డి అన్నారు. గతనెల 23న గూడూరులోని రోటరీ భవనం వద్ద ఏర్పాటుచేసిన కార్యక్రమంలో మాట్లాడుతూ 114 ఏళ్ళ క్రితం ఏర్పాటుచేసిన రోటరీక్లబ్ ప్రపంచవ్యాప్తంగా ఎన్నో సేవాకార్యక్రమాలను నిర్వహిస్తోందన్నారు. పేదరికాన్ని జయించడం, ఆకలిని నిర్మూలించడం వంటి లక్ష్యాలతో రోటరీక్లబ్ సేవాభావంతో ముందుకు సాగుతోందన్నారు. పోలియో రహిత ప్రపంచ సాధనకు రోటరీక్లబ్ చేస్తున్న కృషి అపారమన్నారు. గూడూరులో ఏర్పాటుచేసిన రోటరీక్లబ్ పాఠశాలల్లో మౌళికవసతుల ఏర్పాటు, విద్యార్థులకు ఉపకార వేతనాలు అందించడం, అక్షరాస్యతను పెంపొందించడం, క్రీడల పట్ల విద్యార్థులకు ప్రోత్సాహం అందించడం వంటి ఎన్నో సేవా కార్యక్రమాలను నిర్వహిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో రోటరీక్లబ్ అధ్యక్ష కార్యదర్శులు హరిప్రసాద్, రామకృష్ణ స్వరూప్, బి. దశరధరామిరెడ్డి, నాగసూరి గోపాలరావు, ఎన్వి రత్నం, మయూరి శ్యాంయాదవ్, ఎన్.బాలకృష్ణమరాజు, పివి కృష్ణయ్య, ఎం. దయాకర్‌రెడ్డి, సంజయ్, రఘురామిరెడ్డి, జెజె నాయుడు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే సునీల్, ఆలయ చైర్మెన్ పెంచలనాయుడును సత్కరిస్తున్న సభ్యులు

## అలఘునాధస్వామి ఆలయానికి కొత్త పాలకమండలి

గూడూరు పట్టణంలోని శ్రీ అలఘ నాధస్వామి దేవాలయ నూతన పాలక మండలి ప్రమాణ స్వీకారోత్సవం గతనెల 23న జరిగింది. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ ఈ ఆలయ అభివృద్ధికి కొత్త పాలకమండలి మరింతగా కృషిచేయాలన్నారు. నూతనంగా ఎన్నికైన ఆలయ ధర్మకర్తల మండలి చైర్మెన్ కంకణాల పెంచలనాయుడు, సభ్యులు పుచ్చ శ్రీగౌరి, కొడవలూరు ప్రసాదరావు, ఎల్వి సుబ్బయ్య, చెన్నూరు నాగేశ్వరరావు, రావూరు శేషయ్య, పల్లి కోటేశ్వరరావులతో ఎమ్మెల్యే ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్, నూతన చైర్మెన్‌ను పాలకమండలి సభ్యులు ఘనంగా సత్కరించారు.

## డిఆర్‌డబ్ల్యు కాలేజీ 38వ వార్షికోత్సవం




మాట్లాడుతున్న విఎస్‌యు ఉపకులపతి సుదర్శనరావు, పక్కన డాక్టర్ సిఆర్‌రెడ్డి

గూడూరులోని డిఆర్ డబ్ల్యు కళాశాల 38వ వార్షికోత్సవ వేడుకలు గతనెల 23వ తేదీ ఘనంగా జరిగాయి. విక్రమసింహపురి విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య ఆర్.సుదర్శనరావు ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ విద్యార్థులు చదువులో బాగా రాణించాలని, క్రమశిక్షణతో..పట్టుదలతో చదువుకుని ఉన్నతశిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. అనంతరం వివిధ పోటీల్లో విజేతలైన విద్యార్థులకు బంగారుపతకాలు అందజేశారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా విద్యార్థినులు ప్రదర్శించిన నృత్యాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ వేడుకల్లో ప్రాంతీయ వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ ఉమ, కళాశాల కరెస్పాండెంట్ డాక్టర్ సిఆర్‌రెడ్డి, డాక్టర్ మెహర్మణి, ప్రధానాచార్యులు భారతలక్ష్మి, పద్మావతి, జానకిరామిరెడ్డి, రొటేరియన్లు తదితరులు పాల్గొన్నారు.



గూడూరు బైపాస్‌రోడ్‌లో బూదనం వద్ద కొత్తగా నిర్మించిన ఏ-5 హోటల్‌ను రాష్ట్ర వ్యవసాయమంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఫిబ్రవరి 24న ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు ఎమ్మెల్సీ బీద రవిచంద్ర, ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్, హోటల్ అధినేత బద్రి గిరిధర్ తదితరులు పాల్గొన్నారు.



## శ్మశానవాటిక ప్రహరీగోడ నిర్మాణానికి శంకుస్థాపన

గూడూరులోని శ్మశానవాటికకు 10లక్షల రూపాయలతో రోడ్డు, మరియు ప్రహరీగోడ నిర్మాణానికి ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ ఇటీవల శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ ప్రముఖులు, రోటరీ సభ్యులు, మునిసిపల్ వైస్‌ఛైర్మెన్ కిరణ్‌కుమార్, జడ్పీటిసి సభ్యురాలు పద్మజారెడ్డి, దశరధరామిరెడ్డి, కె.మునిగిరీష్, హరిప్రసాద్, రమణబాబు, భాస్కర్‌రెడ్డి, నరసరాజు, నందిమండలం బాలకృష్ణరాజు, రఘురామిరెడ్డి, స్వరూప్ పాల్గొన్నారు.




నిర్యాణం : 1995, మార్చి 1వ తేదీ

స్వర్గీయ శ్రీమతి రుక్మిణమ్మ

(స్వర్గీయ తిక్కవరపు బాబురెడ్డి గారి ధర్మపత్ని)

మాతృదేవోభవ

మా మాతృమూర్తి దైవసన్నిధికి చేరి
24 ఏళ్ళు నిండిన సందర్భంగా
ఆమె ఆత్మశాంతికై భగవంతుని ప్రార్థిస్తూ...
ఆమె ఆత్మీయులైన వారందరికీ
మా మాతృదేవత ఆశీస్సులు కోరుకుంటూ...

డా॥ టి.సుబ్బరామిరెడ్డి
రాజ్యసభ సభ్యులు
మరియు
వారి కుటుంబసభ్యులు

# జయహో భారత్

**దమ్మున్నోడు నాయకుడైతే దెబ్బ ఇలానే వుంటుంది. దేశభక్తినే ఒంట్లో రక్తంగా మలచుకున్నోడు పాలకుడైతే ప్రతీకారం ఇలాగే వుంటుంది. గాంధీ పుట్టిన దేశం, గాంధీలు ఏలిన దేశం అని చెప్పి అందరూ గాంధీల మాదిరిగా వుండరు. ఇది వీరశివాజీ పుట్టిన నేల కూడా! రాణాప్రతాప్‌సింగ్ వంటి ధీరులకు జన్మనిచ్చిన నేల! ఆ వీరుల స్ఫూర్తిని పుణికిపుచ్చుకున్న వాళ్ళు కూడా వుంటారు! శాంతికి, సహనానికి గౌతమ బుద్ధుడు, గాంధీలు ఈ భూమికి స్ఫూర్తిదాతలైతే, యుద్ధానికి, వీరత్వానికి శివాజీ, రాణాప్రతాప్‌లు ఆదర్శమూర్తులు.**

భారతదేశంలో ఇప్పుడున్నది నెహ్రూ వారసత్వ నాయకత్వం కాదు. బాల్యం నుండే జాతీయ భావాలను వంటబట్టించుకుని, నరనరాన దేశభక్తిని నింపుకున్న భారతీయ జనతా ప్రభుత్వం. దాదాపు 600 ఏళ్ళుగా భారతీయ సంస్కృతిపై విదేశీయులు చేసిన దాడులను పదేపదే గుర్తు చేసుకుంటూ, స్వాతంత్ర్యం తర్వాత కూడా స్వధర్మానికి లౌకికవాదం ముసుగులో స్వదేశీనేతలు చేస్తున్న విద్రోహాన్ని తలచుకుంటూ పగతో రగిలిపోతున్న జాతీయవాదుల ప్రభుత్వం. పాకిస్థాన్ అంటేనే ఒంటికాలిపై కయ్యానికి దూకే కమలసైనికుల ప్రభుత్వం. ఫిబ్రవరి 14వ తేదీన జమ్మూకాశ్మీర్ రాష్ట్రం పుల్వామా వద్ద జాతీయ రహదారిపై జైష్ ఇ మహ్మద్ అనే పాక్‌ప్రేరేపిత ఉగ్రవాద సంస్థ జరిపిన ఆత్మాహుతి దాడిలో 40మంది సిఆర్‌పిఎఫ్ జవానులు వీరమరణం పొందారు. ఈ సంఘటన జరిగినప్పుడు మన్మోహన్‌సింగ్ ప్రధానిగా వుండుంటే.... లేదా కాంగ్రెస్ ప్రభుత్వమే వుండుంటే ఏం జరిగి వుండేది. ప్రధాని ఈ దాడిని తీవ్రంగా ఖండించేవాడు. ఉగ్రవాదాన్ని ఉక్కుపాదంతో అణచివేస్తామని ప్రకటించి ఉండేవాడు. ఉగ్రవాద సంస్థలను నిర్మూలించాలని పాకిస్థాన్ ప్రధానికి ఫోన్ చేసుండేవాడు. దాడి పట్ల పాక్ ప్రధాని కూడా సంతాపం తెలుపుండేవాడు. ఇలాంటి విపత్కర పరిస్థితుల్లో జాతి యావత్తు ఒక్కటిగా వుండాలని గంభీర ప్రకటనలు వెలువడేవి. జవానుల ఆత్మలకు శాంతి కలగాలంటూ దేశవ్యాప్తంగా కొవ్వొత్తులతో ర్యాలీలు జరిగేవి.

మరి బీజేపీ ఏలుబడిలో నరేంద్ర మోడీ లాంటి ధీరోదాత్తుడి పాలనలో కూడా జవాన్‌ల ఆత్మలకు శాంతి కలగాలని కొవ్వొత్తుల ర్యాలీలు జరిగితే కాంగ్రెస్ విదేశీభక్తికి, బీజేపీ స్వదేశీ భక్తికి తేడా ఏముంటుంది? అందుకే మోడీ ఆ తేడా చూపించాడు. జవాన్‌ల ఆత్మశాంతి కోసం కొవ్వొత్తుల ర్యాలీలను కాదు, పాకిస్థాన్ వైపు మిరాజ్-2000 యుద్ధ విమానాల ర్యాలీని నిర్వహించాడు. ఫిబ్రవరి 26వ తేదీన పాక్ ఆక్రమిత కాశ్మీర్‌లోని జైష్ ఇ మహ్మద్ ఉగ్ర శిబిరాలపై భారత వాయుసేన బాంబుల వర్షం కురిపించింది. 350మందికి పైగా ఉగ్రవాదులను మట్టుబెట్టింది. కేవలం 12మంది పైలట్లతోనే పని కానిచ్చారు. కేవలం 22నిముషాలలోనే పాకిస్థాన్‌కు ఏం జరుగుతుందో కూడా తెలుసుకునే అవకాశం ఇవ్వకుండానే పని పూర్తి చేశారు.

## శాంతించిన మనసులు...

26వ తేదీ ఉదయం దేశమంతటా పండుగ వాతావరణమే. చీకటి పోయి వెలుతురు వచ్చినంత ఆనందం. పుల్వామా దాడితో ప్రతీకారేచ్ఛతో రగిలిపోతున్న భారతీయులు ఈ దాడితో కుదుటపడ్డారు. వారి మనసులు శాంతించాయి. భారత ఆర్మీ అమరజవాన్‌లకు ఈ దాడితో అసలైన నివాళులర్పించింది.

## పెరిగిన మోడీ ఇమేజ్!

రైల్వేస్టేషన్‌లో టీ అమ్ముకునే స్థాయి నుండి ప్రధాని స్థాయికి ఎదిగిన నాయకుడు నరేంద్ర మోడీ. ఎప్పుడు ఏం చేయాలో తెలిసినోడు. ఒక్క దాడితో అటు పాకిస్థాన్ నోరు తెరిచేలా చేశాడు... ఇటు దేశీయంగా ప్రతిపక్షాల నోర్లు మూయించాడు. ఒకే ఒక్క ఎయిర్ స్ట్రైక్‌తో అటు శత్రు దేశానికి, ఇటు రాజకీయ శత్రువులకు హార్ట్‌ఎటాక్ వచ్చేలా చేశాడు. ఎయిర్ స్ట్రైక్‌తో ప్రధాని మోడీ ఇమేజ్ దేశవ్యాప్తంగా అమాంతం పెరిగింది. దేశాన్ని నడిపించడానికి ఆయనే సమర్ధుడు అనే అభిప్రాయం ప్రజల్లో ఏర్పడింది. ఇంకెవరు ప్రధానిగా వున్నా ఇంత ధైర్యంగా, ఇంత సమర్ధవంతంగా నిర్ణయాలు తీసుకోలేరనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

## గుట్టు చప్పుడు కాకుండా!

పుల్వామా దాడి జరిగిన వెంటనే ప్రధాని మోడీ ఆర్మీకి పూర్తి స్వేచ్ఛనిచ్చాడు. ప్రతీకార చర్య ప్లానింగ్ అవకాశం వాళ్లకే ఇచ్చాడు. ఆర్మీ కూడా చాలా పకడ్బందీగా దాడి వ్యూహరచన చేసింది. జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్ పర్యవేక్షణలో మెరుపుదాడికి మార్గ నిర్దేశనం జరిగింది. మెరికల్లాంటి పైలట్లను దాడికి ఎంపిక చేశారు. పాకిస్థాన్ రాడార్లకు కూడా అందకుండా భారత యుద్ధ విమానాలు నేరుగా వెళ్లి పని పూర్తి చేసి వచ్చాయి. 12వ విమానం తిరిగొచ్చే వరకు ప్రధాని మోడీ దాడిని పర్యవేక్షిస్తుండిపోయాడు.

## ప్రపంచ దేశాల దన్ను..

గత నాలుగున్నరేళ్ళుగా ప్రధాని మోడీ విదేశీ పర్యటనలపై విపక్షాలు చాలా విమర్శలు చేశాయి. ఆయన విదేశాలకు పోయి ఏం ఉద్ధరిస్తున్నాడని సన్నాయి నొక్కులు నొక్కాయి. ఆయన విదేశీ పర్యటనల పర్యవసానమేమిటన్నది, దేశానికి వచ్చిన పెట్టుబడులతోనే కాదు, పుల్వామా దాడి, ఆపై పిఓకెలోని ఉగ్ర శిబిరాలపై భారత్ మెరుపుదాడులతోనూ అర్ధమైంది. ఈ రెండు సంఘటనలలోనూ ప్రపంచ దేశాలన్నీ భారత్‌కు బాసటగా నిలిచాయి. పిఓకెపై దాడి విషయంలో ఏ దేశం కూడా పాకిస్థాన్‌కు సానుభూతి తెలుపలేదు సరికదా, ముందు మీ దేశంలో వున్న ఉగ్రశిబిరాలను నిర్మూలించండంటూ ఆ దేశానికే హితబోధ చేశాయి.

## రాజకీయంగా కలిసొస్తుందా?

పిఓకెలోని ఉగ్రశిబిరాలపై భారత్ మెరుపుదాడులతో భారత దేశంలోని కొందరు రాజకీయ నాయకులకు సంకటస్థితి ఏర్పడింది. ఓ పక్క జవానులను అభినందిస్తూ వీళ్ళు చప్పట్లు కొడుతున్నారు. ఇంకోపక్క ఇది ఎక్కడ ప్రధాని నరేంద్ర మోడీకి రాజకీయ మైలేజీగా మారుతుందోనని ఆందోళన చెందుతున్నారు. వీళ్ళది ఏడవాలో, నవ్వాలో తెలియని పరిస్థితి.

విడివిడిగా పోటీ చేస్తే నరేంద్రమోడీని ఎదుర్కోవడం కష్టం అంటూ ఇటీవల దేశవ్యాప్తంగా కూడా బీజేపీయేతర పార్టీలు ఒక కూటమి కట్టాయి. కాంగ్రెస్ నేతృత్వంలో ఎస్పీ, బిఎస్పీ, తెలుగుదేశం, ఎన్సీపీ, టిఎంసి, దళ్(ఎస్), డిఎంకె, ఆర్జేడి, నేషనల్ కాన్ఫరెన్స్, వామపక్షాలు వంటి పలు పార్టీలు వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో కలిసికట్టుగా మోడీని మట్టి కరిపించాలని కలలు కంటున్నాయి. ఈ కూటమికి తెలుగుదేశం అధినేత చంద్రబాబునాయుడు మార్గనిర్దేశం చేస్తూ వచ్చాడు. నోట్ల రద్దు, జిఎస్టీ వంటి అంశాలను ప్రజల్లోకి తీసుకెళ్లి, మోడీపై వ్యతిరేకత పెంచి బీజేపీని ఓడించాలన్నది వీరి పన్నాగం. కాని, నిన్నటి ఎయిర్ స్ట్రైక్‌తో మోడీ పని ఒకే దెబ్బకు రెండు పిట్టలను కొట్టినట్లుగా అయింది. అటు పాకిస్థాన్‌కు గట్టి సమాధానమిచ్చాడు, ఇటు ప్రతిపక్షాలకు మింగుడుపడకుండా చేశాడు. మోడీ ఎయిర్‌స్ట్రైక్‌కు ప్రత్యర్థులందరూ జైకొట్టాల్సి వచ్చింది!

# వేడెక్కిన ఏపి... నేతల్లో బీపి

(మొదటి పేజీ తరువాయి)

ఈసారి ఎన్నికలు చంద్రబాబు ఐదేళ్ళ పాలనకు రెఫరండం కాబోతున్నాయి. 2014 ఎన్నికల్లో రాష్ట్రంలో ప్రభుత్వ వ్యతిరేకత అన్న భావం లేదు. ఎందుకంటే అప్పటివరకు రాష్ట్రాన్ని పాలించి ఏడ్చిన కాంగ్రెస్ పూర్తిగా చచ్చిపోయింది. అటు చంద్రబాబు... ఇటు జగన్. వారిపై వ్యతిరేకతకు అవకాశం లేదు. ఎందుకంటే చంద్రబాబుకు అప్పటికే పదేళ్ళ గ్యాప్ వచ్చింది. కాబట్టి గతంలో ఆయనపై చూపిన వ్యతిరేకతను మరచిపోయారు ప్రజలు. చంద్రబాబు, జగన్‌లను బేరీజు వేసినప్పుడు అనేక అంశాలలో చంద్రబాబువైపే మొగ్గు కనిపించింది. దాంతోనే టిడిపి అధికారంలోకి వచ్చింది.

మరిప్పుడు రాష్ట్రంలో చంద్రబాబుకు అంత అనుకూల వాతావరణం వుందా? అంటే లేదనే చెప్పాలి. ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడంలో చంద్రబాబు పూర్తిగా విఫలమయ్యాడు. అవినీతి, అక్రమాలు పెరిగాయి. అమరావతి రాజధాని అట్టర్‌ఫ్లాప్ సబ్జెక్ట్. రాష్ట్రంలో చంద్రబాబు పాలనపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వుండింది. ఎప్పుడు ఎన్నికలు జరిగినా తెలుగుదేశం ఓడిపోవడం ఖాయమనే పరిస్థితి. చంద్రబాబు ఎన్నో ఎన్నికలు చూసుంటాడు. ఎన్నో ఎన్నికలు చేసుంటాడు. కరెక్ట్‌గా ఎన్నికలకు రెండు నెలల ముందు తాయిలాలు వదిలాడు. పసుపు - కుంకుమ, పింఛన్‌ల పెంపు, రైతులకు ఆర్ధికసాయం ఈ కోవలోనివే! ఈ తాయిలాలు పార్టీలో కొంతవరకు ఊపును తెచ్చాయనే చెప్పవచ్చు.

ఇక చంద్రబాబు రాజకీయ చాణక్యం, అనుభవం ఏంటన్నది ఆయన చేస్తున్న అభ్యర్థుల కూర్పుతోనే అర్ధమవుతుంది. ఆగర్భశత్రువుల మధ్య సైతం సీట్ల సర్దుబాటు చేస్తున్నాడు. కరణం - గొట్టిపాటి, జేసీ - పరిటాల, కోట్ల - కె.ఇ, అశోకగజపతిరాజు- సుజయ్ రంగారావు, ఆదినారాయణరెడ్డి - రామసుబ్బారెడ్డి... ఇలా ఎంతోకాలంగా నిప్పు - ఉప్పులా వున్న కుటుంబాలను ఒక్కటి చేసి ఆయన అభ్యర్థులను ఎంపిక చేస్తున్నాడు. ఎవరూ పార్టీని వదిలిపోకుండా సీట్లు సర్దుబాటు చేస్తున్నాడు. ఎన్నికల నిర్వహణలో వేగంగా ముందుకు పోతున్నాడు.

## ఇంటి పోరుతో వైసిపి

ప్రజల్లో బలం వుందిగాని ఎన్నికల నిర్వహణలో చూస్తే చంద్రబాబు వేగాన్ని వైసిపి అందుకోలేకపోతోంది. అయితే 2014 ఎన్నికల కంటే కూడా ఇప్పుడు ఈ విషయంలో కొంత మెరుగైందని చెప్పవచ్చు. పార్టీ నాయకుడిగా, ప్రతిపక్ష నేతగా జగన్ ఐదేళ్లు అవిశ్రాంతంగా పోరాడాడు. ప్రజల్లోకి చొచ్చుకుపోవడంలో తండ్రి వై.యస్.రాజశేఖరరెడ్డిని మరిపించాడు. 3,200 కిలోమీటర్ల ప్రజా సంకల్ప పాదయాత్రతో అసాధ్యుడనిపించుకున్నాడు. రాష్ట్రంలో ఈ ఒక్కసారికి జగన్‌కు ఓటేయాలి అనే సానుకూల వాతావరణాన్ని తీసుకొచ్చాడు. వైసిపికి విజయసాయిరెడ్డి, వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, వై.వి.సుబ్బారెడ్డి వంటి వారి రూపంలో ఒక టీమ్ కూడా సెట్ అయ్యింది. పార్టీలోకి చేరికలు కూడా బాగానే వున్నాయి. ముఖ్యంగా 'కాపు' వర్గం నేతలు వైసిపిలో చేరుతుండడం పార్టీకి ఊపునిస్తోంది. అయితే, అభ్యర్థుల ఎంపిక విషయంలోనే వైసిపి ఇంకా వెనుకబడివుంది. ఓ పక్క చంద్రబాబు పార్లమెంటు నియోజకవర్గాల వారీగా సమీక్షలు నిర్వహిస్తూ చకచకా అభ్యర్థుల ఎంపిక కానిస్తున్నాడు. దీనివల్ల అభ్యర్థులు ముందుగా ప్రజల్లోకి వెళ్లగలుగుతారు. కాని, వైసిపిలో అభ్యర్థుల విషయంలోనే ముందరికాళ్లకు బంధాలు పడుతున్నాయి. ఆయా జిల్లాల్లో వీళ్లైతే ఎంపీలు, లేదా ఎమ్మెల్యేలుగా గెలవరు అని ఖచ్చిత సమాచారం వున్న నాయకులను కూడా పక్కన పెట్టలేకపోతున్నారు. సిటింగ్ ఎమ్మెల్యేలు, ఎంపీలని వాళ్ళకే సీట్లిస్తే పార్టీకి నష్టమని తెలిసి కూడా ధైర్యంగా నిర్ణయాలు తీసుకోలేకపోతున్నారు.

అధికారం కావాలంటే మెజార్టీ సీట్లు సాధించాలి. మెజార్టీ సీట్లు కావాలంటే గెలుపుగుర్రాలనే ఎంచుకోవాలి. అంతేగాని, అభ్యర్థులతో పనేంటి. నన్ను చూసే కదా జనం ఓట్లేసేది అనే భ్రమల్లోనే వుండి వైసిపి ఎన్నికలకు పోతే 2014కు 2019కి పెద్ద తేడా వుండదు!

## యుద్ధ సన్నాహాల్లో ఇరు దేశాలు...

భారత్ మెరుపు దాడితో పాక్‌కు తల కొట్టేసినట్లు అయ్యింది. పాక్ పార్లమెంటులో ఇమ్రాన్‌ఖాన్ పరువు పోయింది. దీంతో మేము కూడా ప్రతిదాడి చేయగలమని చెప్పుకోవడానికన్నట్లు ఫిబ్రవరి 27వ తేదీన పాక్ యుద్ధవిమానాలు నియంత్రణ రేఖను దాటి భారత్ భూ భాగంలోకి వచ్చి బాంబులు వేయగా, భారత వైమానిక దళాలు ఆ విమానాలను తిప్పి కొట్టాయి. ఒక విమానాన్ని కూల్చేశాయి. ఈ క్రమంలోనే భారత యుద్ధ విమానం ఒకటి కూలిపోగా, పైలట్ విక్రమ్ అభినందన్ పారాచ్యూట్ సాయంతో పాక్ భూభాగంలో దిగాడు. పాక్ దళాలు అభినందన్‌ను అదుపులోకి తీసుకున్నాయి. ఈ సంఘటనతో భారత్ ఆర్మీ పూర్తిగా యుద్ధానికి సన్నద్ధమైంది. మరోపక్క పాకిస్థాన్ అధ్యక్షుడు మాత్రం కూర్చొని చర్చలు జరపుదామంటూ శాంతి వచనాలు వల్లిస్తున్నాడు. శాంతి నెలకొంటుందో..? లేక యుద్ధమే జరుగుతుందో..? చూడాలి.!



## డబ్బున్నోళ్ళం కాకున్నా...

# ప్రజాభిమానం ఉన్నోళ్ళం

**- నగర ఎమ్మెల్యే అనిల్**



వైసిపిలో చేరిన యువకులు, మహిళలతో ఎమ్మెల్యే అనిల్, డిప్యూటిమేయర్ ద్వారకా

మేము ధనవంతులం కాకపోయినా ప్రజల అభిమానం సంపాదించుకున్నోళ్లమని, వారి మనసుల్లో చోటు సంపాదించుకున్న మనుషులమని నెల్లూరు నగర ఎమ్మెల్యే పి.అనిల్‌కుమార్‌యాదవ్ పేర్కొన్నాడు. ఫిబ్రవరి 24వ తేదీన నెల్లూరు నవాబుపేటలో డిప్యూటి మేయర్ ముక్కాల ద్వారకానాథ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 6, 7, 8, 9 డివిజన్‌ల వైసిపి కార్యాలయాన్ని అనిల్ ప్రారంభించాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ నాయకులు ధనబలంతో మన ఓట్లను కొనాలని చూస్తున్నారని, ధన బలం కంటే జనబలం గొప్పదని నిరూపించే ఒక గొప్ప అవకాశం ఈరోజు నెల్లూరు ప్రజలకి వచ్చిందన్నారు. వై.యస్.జగన్మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేసుకునేంత వరకు, వైసిపిని అధికారంలోకి తెచ్చేవరకు ప్రతి కార్యకర్త ఒక సైనికుడిలా పని చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఒక్కసారి జగనన్న సీఎం అయితే మళ్ళీ మళ్ళీ ప్రజలు ఆయననే సీఎంని చేసేలా పరిపాలన చేస్తారన్నారు. నెల్లూరు నగరంలో ముఖ్యమంత్రి తర్వాత ముఖ్యమంత్రి అని చెప్పుకునే మంత్రి నారాయణను ఓడించే మంచి అవకాశం నెల్లూరు ప్రజలకు వచ్చిందని, తాత్కాలిక తాయిలాలతో వేలకోట్లు ప్రజాధనాన్ని లూటీ చేసిన నారాయణ లాంటి వాళ్లకు నెల్లూరు ప్రజల సత్తా ఏంటో చూపాలని అనిల్ పిలుపునిచ్చాడు. ఈ సందర్భంగా 4, 5, 9వ డివిజన్‌లకు చెందిన దాదాపు 300 మంది యువకులు వైసిపిలో చేరగా, అనిల్ వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించాడు. మిద్దె రవికుమార్, బ్రహ్మదేవి మోహన్, బ్రహ్మదేవి ప్రసాద్, టి.సుకుమార్, కనకర్లపూడి సాంబశివరావు, శిరిగి వినోద్‌కుమార్, ఆలీభాయ్, మహీధర్‌రెడ్డి తదితరులు పార్టీలో చేరగా, కార్యక్రమంలో వైయస్సార్‌సీపీ వాణిజ్య విభాగ రాష్ట్ర అధ్యక్షులు కుప్పం ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# 'మాగుంట'.. ఏ ఇంట?

- **ఒంగోలైతే వైసిపి**
- **నెల్లూరైతే టిడిపి**

## బాల్ ఇప్పుడు శీనయ్య కోర్టులోనే ఉంది



**నెల్లూరు, ప్రకాశం జిల్లాల రాజకీయ తెరపై ఇప్పుడు ప్రధాన చర్చగా విన పడుతున్న పేరు.. మాగుంట శ్రీనివాసులు రెడ్డి. ఆయన టిడిపిని వదిలి వైసిపి తీర్థం పుచ్చుకోవడానికి దాదాపుగా ముహూర్తం ఖరారైన తరుణంలో వై.వి.సుబ్బారెడ్డి పేల్చిన సీటు బాంబు మొత్తం సీన్‌ను మార్చేసింది.**

సుబ్బారెడ్డి మాటలతో మనస్తాపం చెందిన శీనయ్య ఇప్పుడు ఆలోచనలో పడి పోయి బుధవారమంతా నెల్లూరులోనే కూర్చుని తన అనుయాయులతో, అభిమాను లతో సమాలోచనలు జరిపాడు. మీకే సీటిస్తాం రండి.. అంటూ వైసిపి అధి ష్టానం పదేపదే ఓవైపు రాయబారాలు పంపుతుంటే, మరోవైపు మీరు మా పార్టీ లోనే ఉండండి... మీరడిగింది చేస్తాం.. అంటూ తెలుగుదేశం రాజకీయ బేరాలు మొదలుపెట్టింది.

బుధవారం ఉదయం నుండి సాయంత్రం వరకు నెల్లూరులోని మాగుంట కార్యాలయం కల్యాణి ఫిలిమ్స్ ఈ చర్చలకు వేదిక కాగా, ఇక్కడికి పలువురు వైసిపి, టిడిపి నేతలు వరుసపెట్టి మాగుంట మనసు తెలుసుకునే ప్రయత్నం చేశారు. చివరగా రాత్రి 9గంటల తర్వాత సరస్వతినగర్‌లోని మాగుంట నివాసానికి సీన్ మారడంతో మంత్రి సోమిరెడ్డి కూడా మాగుంట నివాసానికి వచ్చి రాత్రి 10.30 గంటల వరకు శీనయ్యను బుజ్జగించి పార్టీలో నిలుపుకునే ప్రయత్నం చేసినట్లు తెలిసింది.

శీనయ్య మాత్రం ఎవరేం చెప్పినా తనేం మాట్లాడకుండా మౌనముద్ర వహిం చాడని, రెండురోజులు ఆలోచించుకుని నిర్ణయం చెప్తానని చెప్పాడని ఆయన ముఖ్యులు చెప్తున్నారు. ఎక్కువమంది నెల్లూరు తెలుగుదేశం నుండి పోటీ చేయాలని చెప్పినప్పటికీ ఆయన మాత్రం వైసిపి వైపే మొగ్గు చూపుతున్నాడని కూడా వారంటున్నారు. ఇటు వైసిపి అధ్యక్షుడు జగన్మోహన్‌రెడ్డి లేదా అటు తెలుగుదేశం పార్టీ సారధి చంద్రబాబునాయుడు నేరుగా రంగంలోకి దిగితే గానీ విషయం కొలిక్కి రాదన్నది శీనయ్య అనుయాయుల అభి ప్రాయం. మొత్తమ్మీద మరో రెండురోజుల్లో ఈ సస్పెన్స్‌కు తెరపడవచ్చు.






18వ వర్ధంతి

పూజ్యులు

స్వర్గీయ వేమిరెడ్డి శివకోటారెడ్డి గారు

నిర్యాణం: 06.03.2001

స్వర్గస్తులై 06.03.2019 నాటికి
18 సంవత్సరాలు నిండుతాయి.

వారి ఆత్మశాంతికై భగవంతుని ప్రార్థిస్తూ...

కుమారుడు:
వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి
రాజ్యసభ సభ్యులు

Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Executive Editor-**G.SREENIVASULU REDDY**. e-mail: roopagroup@yahoo.com